www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 164 | బుధవారం 05.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారిగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

## చంపేస్తున్న.. చాందీపుర!

### ఇసుక ఈగల ద్వారా వైరస్ వ్యాప్తి.. నిపుణుల హెచ్చరిక

- 15 ఏళ్లలోపు చిన్నారులపై తీవ్ర ప్రభావం
- ఇప్పటికే 22 మంది మృతి.. 35 మందికి వైరస్ నిర్ధారణ
- 184కిపైగా అనుమానిత కేసులు నమోదు
- గాంధీనగర్ సహా పలు జిల్లాల్లో హై అలర్ట్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణుల పర్యవేక్షణలో చికిత్స
- కొత్త కేసులతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ
- క్రిమిసంహారక మందుల పిచికారీకి ప్రభుత్వం ఆదేశాలు
- మట్టి ఇళ్ల గోడల పగుళ్లు మూసివేయాలని సూచనలు

02




## విద్యా వ్యవస్థను సీఎం నాశనం చేస్తున్నారు

### చదువు లేనోడివి నీకు విద్యాశాఖ ఎందుకు?

- మూడేళ్లలో ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్
- ఉపాధ్యాయులు చప్పట్లు కొట్టడం సరికాదని వ్యాఖ్య
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రశ్నలు
- టీచర్ల పీఆర్సీపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీజేపీ ఎంపీ
- కమిషన్ల కోసమే కొత్త పాఠశాలల నిర్మాణమా? అని విమర్శ
- 'రేవంత్ ఇప్పటికీ ప్రతిపక్ష నేతలా మాట్లాడుతున్నారు'
- పెట్టుబడులను దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపణ

**ఇంజినీరింగ్ విద్యార్థులపై సీఎం వ్యాఖ్యలు దురదృష్టకరం**

03



# ఇంటర్ బోర్డు రద్దు !

**'ఒకే బోర్డు-ఒకే విద్యా పరిపాలన'**

## పాఠశాల, ఇంటర్ విద్యకు ఇక ఒకే బోర్డు

**కేబినెట్ ఆమోదం తర్వాత అసెంబ్లీలో కొత్త బిల్లు**

- 'తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు' ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధం
- 1971, 1982 విద్యా చట్టాల స్థానంలో కొత్త చట్టం
- 2027-28 నుంచి ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒకే బోర్డు
- విద్యా వ్యవస్థ ఏకీకరణకు విలీన ముసాయిదా బిల్లు సిద్ధం
- న్యాయశాఖ పరిశీలనలో కొత్త విద్యా బిల్లు
- ఇంటర్ బోర్డు స్వయం ప్రతిపత్తిపై త్వరలో తుది నిర్ణయం
- కొత్త బోర్డు స్వయం ప్రతిపత్తి సంస్థగా కొనసాగుతుందా?
- ప్రభుత్వ శాఖ పరిధిలోకి తీసుకురావాలా?.. ప్రభుత్వ పరిశీలన
- విద్యా పరిపాలనలో సమూల మార్పులకు ప్రభుత్వం సిద్ధం
- పాలిటెక్నిక్ కళాశాలలు స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి
- 59 ప్రభుత్వ, 53 ప్రైవేట్ పాలిటెక్నిక్‌లకు కొత్త పరిపాలన

02

**కొత్త బోర్డు స్వయం ప్రతిపత్తి సంస్థగా కొనసాగుతుందా?**

**ప్రభుత్వ శాఖ పరిధిలోకి తీసుకురావాలా?..**

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

తెలంగాణ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం అతిపెద్ద నిర్మాణాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. దశాబ్దాలుగా విడివిడిగా కొనసాగుతున్న పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలను ఏకీకృతం చేస్తూ 'తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (TGSEB)' ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం 1971, 1982 నాటి విద్యా చట్టాలను రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం న్యాయశాఖ పరిశీల నలో ఉన్న విలీన ముసాయిదా బిల్లుకు ఆమోదం లభిస్తే, 2027-28 విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే బోర్డు ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ కొనసాగనుంది.తెలంగాణ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలను ఏకీకృతం చేస్తూ 'తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (TGSEB)' పేరుతో ఒకే బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విలీన ముసాయిదా బిల్లు ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.





## సిట్ అదనపు చార్జిషీట్?

- ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు చార్జిషీట్‌కు సిట్ సిద్ధం
- 600 మందికి పైగా వాంగ్మూలాలతో దర్యాప్తు కీలక దశకు
- రాజకీయ నేతల పేర్లపై సిట్‌లో తీవ్ర కసరత్తు
- ఆగస్టు చివరిలో అదనపు చార్జిషీట్ దాఖలు చేసే అవకాశం
- టెలిఫోన్ యాక్ట్‌తో చార్జిషీట్ దాఖలు చేయనున్న సిట్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక ఆధారాలు సేకరించిన అధికారులు

02

## హరీష్ రావు పశుపతిలా వ్యవహరిస్తున్నారు

- క్షుద్రపూజలపై ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ నేత
- వ్యాఖ్యహరీష్ రావు పర్యటనల తేదీలు వెల్లడించిన
- మహేష్ కుమార్ గౌడ్రాష్ట్రానికి మంచిజరగకూడదనే
- కుట్రలు చేశారని ఆరోపణశివమొగ్గ, తిరుచిరాపల్లి పర్యటనలపై వివరణ ఇవ్వాలని డిమాండ్
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు
- వాస్తవాలు చెబితేనే తదుపరి సమాధానాలంటున్న కాంగ్రెస్

03



## ప్రభుత్వ కార్యాలయాల్లో కీలక మార్పు..

- సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ తప్పనిసరి
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలకు చెక్
- టీ-ఫైబర్ ద్వారానే అన్ని ప్రభుత్వ శాఖలకు ఇంటర్నెట్
- ప్రైవేట్ నెట్ బిల్లుల చెల్లింపులు నిలిపివేయాలని ఆదేశం
- నెల రోజుల్లో స్టేట్ వైడ్ నెట్‌వర్క్ టీ-ఫైబర్‌లోకి మైగ్రేషన్
- టీ-ఫైబర్ విస్తరణపై మంత్రి శ్రీధర్ బాబు కీలక ఆదేశాలు

02

### ఇంటింటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ లక్ష్యంగా ప్రభుత్వం

### డిజిటల్ తెలంగాణ దిశగా మరో కీలక అడుగు




తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కేవలం 'టీ-ఫైబర్' ద్వారానే ఇంటర్నెట్ సౌకర్యం అందించాలని సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో టీ-ఫైబర్ పురోగతిపై ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజూ, జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, టీ-ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నిర్దేశిత గడువులోగా అవసరమైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ పనులను పూర్తి చేసి, అన్ని ప్రభుత్వ కార్యాలయాలను టీ-ఫైబర్ నెట్‌వర్క్ పరిధిలోకి తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు.




## ఎల్‌నినో లెక్కలు.. తారుమారు!

**రెండు వారాలు వానలుం టాయ్**

- ఎల్నినో ప్రభావం తగ్గే సూచనలు
- రాబోయే 15 రోజులు చురుగ్గా నైరుతి రుతుపవనాలు
- దేశవ్యాప్తంగా విస్తృత వర్షాలకు అనుకూల పరిస్థితులు
- రైతన్నలకు ఊరటనిచ్చేలా వానలు
- ఖరీఫ్ పంటలకు మేలు అంటున్న అధికారులు

02

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతులకు అంతర్జాతీయ వాతావరణ నిపుణులు ఊరటనిచ్చే అంచనాలు వెల్లడించారు.రాబోయే రెండు వారాల్లో నైరుతి రుతుపవనాలు మరింత చురుగ్గా మారి దేశవ్యాప్తంగా విస్తృత వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

## కెమికల్స్ తో కల్తీ మసాలా తయారీ..

### 13 ప్రాంతాల్లో సోదాలు.. 89 వేల కిలోల కల్తీ ముడి సరుకు స్వాధీనం



- హైదరాబాద్‌లో భారీ కల్తీ మసాలాల ముఠా గుట్టురట్టు
- 25 వేల కిలోల కల్తీ మసాలాలు స్వాధీనం
- మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్‌లో తయారీ కేంద్రాలపై దాడులు ముగ్గురు నిందితుల అరెస్ట్..
- బీఎన్ఎస్ సెక్షన్ 110 కింద కేసులు
- టాల్కమ్ పౌడర్, బట్టల రంగులతో మసాలాల కల్తీ
- సింథటిక్ కలర్లతో నాసిరకం మసాలాలకు మెరుపు
- 13 ప్రాంతాల్లో సోదాలు.. 89 వేల కిలోల కల్తీ ముడి సరుకు స్వాధీనం
- హెచ్-ఫాస్ట్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ సంయుక్త ఆపరేషన్
- పౌరుడి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన భారీ మోసం

05



## మద్రాస్ హైకోర్టు ఆదేశాలు..

- వివాదాస్పద వ్యాఖ్యల కేసులో ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్
- విచారణ అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం
- రిమాండ్ కోరబోమని కోర్టుకు తెలిపిన తమిళనాడు ప్రభుత్వం
- అరెస్టుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే ఆందోళనలు

02

# మద్రాస్ హైకోర్టు ఆదేశాలు..

## ఉదయనిధిని వెంటనే రిలీజ్ చేయండి..

**చెన్నై :** సినీ నటి త్రిషను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే కేసులో అరెస్టైన తమిళనాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టు ఊరటనిచ్చింది. విచారణ పూర్తయ్యాక వెంటనే స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయాలని తమిళనాడు పోలీసుల్ని ఆదేశించింది. కావేరీ జల వివాదం నేపథ్యంలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి విజయ్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు నటి త్రిషను ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు భావించి ఉదయనిధిపై కేసు నమోదు చేశారు. హైడ్రామా నడుమ ఆయనను అరెస్ట్ చేశారు. ఉదయనిధి అరెస్ట్ తర్వాత ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. ఉదయనిధిని తంజావూర్ తరలించినప్పటికీ, ఆయనను న్యాయస్థాన రిమాండ్‌కు పంపే ఉద్దేశం లేదని కేవలం విచారణ నిర్వహించి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేస్తామని తమిళనాడు అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్ కోర్టు తెలిపారు. విచారణ అనంతరం అదే రోజు ఉదయనిధిని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇదిలా ఉంటే, ఉదయనిధి అరెస్ట్‌పై తమిళనాడు వ్యాప్తంగా డీఎంకే శ్రేణులు ఆందోళనకు దిగారు. పలుచోట్ల రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మరోవైపు డీఎంకే అధ్యక్షుడు ఎం.కే స్టాలిన్ అత్యవసర భేటీ నిర్వహించి, తదుపరి కార్యచరణపై చర్చించారు. ఈ కేసులో అసభ్య పదజాలం వినియోగం, మహిళ గౌరవాన్ని అవమానించడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, అల్లర్లకు ప్రేరేపించడం, క్రిమినల్ బెదిరింపులకు సంబంధించిన పలు సెక్షన్ల కింద ఉదయనిధిపై కేసులు నమోదు చేశారు. తాను సీఎం విజయ్ పేరు తప్పా, మరెవరి పేరు ప్రస్తావించలేదని ఉదయనిధి మీడియాతో అన్నారు. మరోవైపు, టీవీకే ఉదయనిధి వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ను ఆశ్రయించింది.

# చంపేస్తున్న.. చాందీపుర!

**గుజరాత్ :** గుజరాత్లో అరుదైన 'చాందీపుర' వైరస్ వేగంగా వ్యాపిస్తూ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా 15 ఏళ్లలోపు చిన్నారులనే లక్ష్యంగా చేసు కుంటున్న ఈ వైరస్ కారణంగా ఇప్పటికే 22 మంది మృతి చెందగా, పలువురు చికిత్స పొందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 184 మందికి పైగా అనుమానిత కేసులు నమోదు కాగా, 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. మరో 11 నమూనాల పరీక్షల ఫలితాలు రావాల్సి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా వెల్లడించారు.

**నిపుణుల పర్యవేక్షణలో చిన్నారులకు చికిత్స**

ప్రస్తుతం గాంధీనగర్, సబర్కాంత - హిమ్మత్నగర్, పటాన్, రాజ్కోట్, భావ్నగర్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారులకు నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. వైరస్ నిర్ధారణ అయిన వారిలో పలువురు కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయినప్పటికీ, కొత్త కేసులు నమోదవుతుండటంతో ప్రభుత్వం అప్రవత్తమైంది.

**ఇసుక ఈగలతో వైరస్ వ్యాప్తి**

ఈ వైరస్ వ్యాప్తికి ఇసుక ఈగలు ప్రధాన కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో పశువులున్న ప్రాంతాలు, గ్రామాల్లో విస్తృతంగా క్రిమిసంహారక మందుల పిచికారీ చేపట్టడంతో పాటు మట్టి ఇళ్ల గోడల పగుళ్లను మూసివేయాలని ప్రజలకు సూచిస్తున్నారు. అధిక జ్వరం, వాంతులు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రికి తరలించాలని, అవసరమైతే వెంటిలేటర్ సదుపాయం ఉన్న ఐసీయూలో చికిత్స అందించాలని ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేసింది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించిన ప్రభుత్వం వైద్య బృందాలను క్షేత్రస్థాయిలో మోహరించింది. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది.

# 22 మంది చిన్నారులు మృతి

**గుజరాత్ :** గుజరాత్ రాష్ట్రంలో చండీపురా వైరస్ కలకలం రేగింది. వైరస్ బారినపడి 22 మంది చిన్నారు చినపోయారు. మరో ఏడుగురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 35 మందికి వైరస్ నిర్ధారించారు. వైరస్ పోయేందుకు గ్రామాల్లో క్రిమి సంహారక మందులను పిచికారి చేస్తున్నారు. ఇదిలా ఉంటే చండీపురా వైరస్ అనేది 15ఏళ్ల లోపు చిన్నారులపై ప్రభావం చూపించే ప్రమాదకరమైన వైరల్ ఇన్ఫెక్షన్. శాండ్ ఫ్లై అనే ఈగల ద్వారా, మురికి కాలువలో ఉండే దోమలు, నల్లులు లాంటి కీటకాల ద్వారా ఇది వ్యాపిస్తుంది. ఒక మనిషి నుండి మరొకరికి నేరుగా వ్యాపించదు. ఈ వైరస్ కారణంగా చిన్నారులకు తీవ్రమైన మెదడువాపు వస్తుంది. వైరస్ సోకిన చిన్నారుల్లో లక్షణాలు వేగంగా పెరిగిపోతాయి. కొన్నిసార్లు 48 గంటల్లోనే పరిస్థితి విషమించే ప్రమాద ఉంటుంది. అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, విరేచనాలు, మూర్ఛ రావడం, మెదడు కణజాలల వాపు, కోమాలోకి వెళ్లడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇప్పటి వరకు దీనికి సరైన యాంటివైరల్ మందులు అందుబాటులో లేవు. వైరస్ బారిన పడినవారిని ఐసీయూలో అత్యవసర చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయం నుండి బయటపడవచ్చు.

# స్టేట్ బార్ కౌన్సిళ్లు 'పురుషుల క్లబ్బులు'గా మారాయి

**ఢిల్లీ :** దేశంలోని ఆయా రాష్ట్రాల బార్ కౌన్సిళ్లు రోజురోజుకూ పురుషుల క్లబ్బులుగా మారిపోతున్నాయని సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఓటింగ్ విధానం, మహిళా సభ్యులను ఎన్నుకోవడంతో సహా స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించిన పలు పిటిషన్లపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అయితే, విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. స్టేట్ బార్ కౌన్సిళ్లు పురుషుల క్లబ్బులుగా తయారయ్యాయని అన్నారు. దానిని తాము ఏకఛత్రాధిపత్యంలా భావిస్తున్నామని.. అన్ని గమనిస్తూనే ఉన్నామని అన్నారు. అలాంటి విధానం పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు.

**హైకోర్టు సీజేలకు కీలక ఆదేశాలు..**

బార్ కౌన్సిల్ ఎన్నికల వివాదాలకు సంబంధించిన వరుస పిటిషన్ల విచారణ సందర్భంగా కోర్టు కీలక నిర్ణయాలు తీసుకుంది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, దేశంలో ఉన్న స్టేట్ బార్ కౌన్సిళ్ల ఎన్నికలను పర్యవేక్షించడానికి, ఎన్నికల వివాదాలను పరిష్కరించడానికి జస్టిస్ సుధాంశు ధులియా నేతృత్వంలో సుప్రీంకోర్టు గతంలో ఓ ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. తాజాగా కోర్టు కీలక ఆదేశాలు ఇస్తూ.. ప్రతి స్టేట్ బార్ కౌన్సిల్‌కు ఇద్దరు మహిళా సభ్యులను డైరెక్ట్‌గా నామనేట్ చేయాలని సంబంధిత హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను ఆదేశించింది. వారిలో ఒకరు హైకోర్టు మాజీ న్యాయమూర్తి కాగా, మరొకరు బార్‌లో మంచి గుర్తింపు ఉన్న సీనియర్ మహిళా న్యాయవాది అయి ఉండాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా, స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థిని ఈ కో-ఆప్షన్ నియామకం కోసం పరిశీలించకుండా అనర్హులుగా ప్రకటించలేరని కోర్టు స్పష్టం చేసింది.

# ప్రభుత్వ కార్యాలయాల్లో కీలక మార్పు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కేవలం 'టీ-ఫైబర్' ద్వారానే ఇంటర్నెట్ సౌకర్యం అందించాలని సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో టీ-ఫైబర్ పురోగతిపై ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజూ, జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, టీ-ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నిర్దేశిత గడువులోగా అవసరమైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ పనులను పూర్తి చేసి, అన్ని ప్రభుత్వ కార్యాలయాలను టీ-ఫైబర్ నెట్‌వర్క్ పరిధిలోకి తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు.

**సెప్టెంబర్ 1 తర్వాత వాటికి నో బిల్స్..**

సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ ఇంటర్నెట్ సేవల బిల్లులను ప్రాసెస్ చేయవద్దని, ఎలాంటి చెల్లింపులు జరపవద్దని మంత్రి స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్ ను నెల రోజుల్లోగా టీ-ఫైబర్ నెట్‌వర్క్‌లోకి మైగ్రేషన్ కావాలని, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌కు అంతర్జాతీయ స్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాలను అందించేందుకు అత్యంత వేగవంతమైన టీ-ఫైబర్ సేవలను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. తెలంగాణలోని ప్రతి ఇంటికీ డిజిటల్ కనెక్టివిటీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇంటింటికీ ఇంటర్నెట్ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఎల్‌నినో లెక్కలు.. తారుమారు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది భారతదేశంలో నైరుతి రుతుపవనాలు ఆశించిన స్థాయిలో చురుగ్గా సాగకపోవడంతో అనేక ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే రాబోయే 15 రోజులు పరిస్థితులు అనుకూలంగా మారనున్నాయని అంతర్జాతీయ వాతావరణ నిపుణులు వెల్లడించారు. ప్రస్తుతం హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో వాతావరణ వ్యవస్థలు బలపడుతున్నాయి. ముఖ్యంగా మ్యాడెన్-జూలియన్ ఆసిలేషన్ దక్షిణ బంగాళా ఖాతం వైపు చురుగ్గా ఉండటంతో మేఘాల ఏర్పాటుకు, వర్షపాత వ్యవస్థల అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇదే సమయంలో ఉత్తర, తూర్పు భారతదేశంలో అల్ప పీడనాలు, వర్షపాత వ్యవస్థలు కూడా చురుగ్గా మారడంతో దేశవ్యాప్తంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**వ్యవసాయ రంగానికి ఊరట..**

ప్రస్తుతం ఇండియన్ ఓషన్ డైపోల్ తటస్థ స్థితిలో కొనసాగుతున్నప్పటికీ, పసిఫిక్ మహాసముద్రంలో ఎల్నినో ప్రభావం మార్పులకు అనుగు ణంగా హిందూ మహాసముద్రంలో సానుకూల పరిస్థితులు ఏర్పడే అవ కాశముందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. దీంతో ఎల్నినో వల్ల ఏర్పడే వర్షాభావ ప్రభావం కొంత మేర తగ్గి, భారత ఉపఖండంలో సాధా రణానికి దగ్గరగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

వర్షాకాలం చివరి దశలో రాబోయే ఈ రెండు వారాలు అత్యంత కీలకంగా మారనున్నాయని, ఈ కాలంలో కురిసే వర్షాలు ఖరీఫ్ పంటల భవితవ్యాన్ని నిర్ణయించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. వర్షపాతం పెరిగితే వ్యవసాయ రంగానికి ఊరట లభించ డంతో పాటు నీటి నిల్వలు కూడా మెరుగుపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# న్యాయవాది హత్యకు నిరసనగా న్యాయవాదుల విధుల బహిష్కరణ..





**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** కొల్లాపూర్ బార్ అసోసియేషన్ మెంబర్, న్యాయవాది మల్లయ్య హత్యకు నిరసనగా మంగళవారం కరీంనగర్ జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. జిల్లా కోర్టు ముందు నల్ల బ్యాడ్జ్ లు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ కుమార్ లు మాట్లాడుతూ.. న్యాయవాది మల్లయ్య హత్య ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, పోలీసులు వెంటనే స్పందించి మల్లయ్య హత్యకు కారణమైన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు ఐక్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు బండ శివకుమార్, మూడపల్లి అనురాధ, బెజ్జంకి శ్రీకాంత్, సీనియర్ న్యాయవాదులు బాస సత్యనారాయణ రావు, దేవేందర్ రెడ్డి, కొరివి వేణుగోపాల్, నర్సింహా రెడ్డి, బండ గోపాల్ రెడ్డి, శంకరయ్య, సిరికొండ శ్రీధర్ రావు, గొంటి మధు, బెజ్జంకి రాంబాబు, నేతికుంట అనూప్, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ...

**మెట్‌పల్లి,ఫ్లాష్ ఇండియా :** మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, పలురికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థను పరిశీలించి నేరస్తులపై నిఘాను, నేరా చరిత్ర గల వారిపై నిఘా పెట్టాలని అన్నారు. నేర నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు, సీసీ కెమెరాల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ నిబంధనల అమలుతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాములు, ఎస్సై లు పబ్బ కిరణ్‌కుమార్, రాజునాయక్, సిబ్బంది ఉన్నారు.

# ఇంటర్ బోర్డు రద్దు !



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం అతిపెద్ద నిర్మాణాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. దశాబ్దాలుగా విడివిడిగా కొనసాగుతున్న పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలను ఏకీకృతం చేస్తూ 'తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (TGSEB)' ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం 1971, 1982 నాటి విద్యా చట్టాలను రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం న్యాయశాఖ పరిశీల నలో ఉన్న విలీన ముసాయిదా బిల్లుకు ఆమోదం లభిస్తే, 2027-28 విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే బోర్డు ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ కొనసాగనుంది. తెలంగాణ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలను ఏకీకృతం చేస్తూ 'తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (TGSEB)' పేరుతో ఒకే బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విలీన ముసాయిదా బిల్లు ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అన్ని ప్రక్రియలు పూర్తయితే 2027-28 విద్యా సంవత్సరం నుంచి ఒకటే తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే బోర్డు పరిధిలోకి రానున్నాయి. ప్రస్తుతం పాఠశాల విద్య తెలంగాణ విద్యా చట్టం-1982, ఇంటర్మీడియట్విద్య తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా చట్టం-1971 ప్రకారం కొనసాగుతోంది. ఈ రెండు సమస్యలు తలెత్తకుండా న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.

**స్వయం ప్రతిపత్తిపై తుది నిర్ణయం**

ప్రస్తుతం ఇంటర్మీడియట్ బోర్డు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా సొంత నిధులతో పనిచేస్తుండగా, పదో తరగతి బోర్డు పూర్తిగా ప్రభుత్వ నిధులపై ఆధా రపడి కొనసాగుతోంది. రెండు బోర్డులు విలీనమైన తర్వాత కొత్త బోర్డును స్వయం ప్రతిపత్తి సంస్థగా కొనసాగించాలా లేదా ప్రభుత్వ శాఖ పరిధిలోకి తీసుకురావాలా అనే అంశంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

**స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్ కళాశాలలు**

విద్యా సంస్కరణల్లో భాగంగా రాష్ట్రంలోని 59 ప్రభుత్వ, 53 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (SBTET) నిర్వహిస్తున్న పరీక్షలు, సిలబస్ రూపకల్పన, పరిపాలనా బాధ్యతలను స్కిల్స్ యూనివర్సిటీకి బదిలీ చేయనున్నారు. న్యాయశాఖ ఆమోదం అనంతరం ముసాయిదా బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ముందుంచి, తర్వాత అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత 2027-28 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఒకే బోర్డు ఒకే విద్యా పరి పాలనా వ్యవస్థ అమల్లోకి రానుంది.



# సిట్ అదనపు చార్జిషీట్?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు మరో కీలక మలుపు తిరగబోతున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో త్వరలోనే సిట్ అధికారులు అడిషనల్ చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధవవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు కీలక నేతలు, అధికారులను విచారించిన సిట్ 600 మందికి పైగా స్టేట్‌మెంట్లు రికార్డు చేసింది. వీరందరి వాంగ్మూలాల ఆధారంగా ఈ ఆగస్టు చివరిలోపు అదనపు చార్జిషీట్ దాఖలు చేయాలని సిట్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

**వారి పేర్లపై తర్జన భర్జన!**

అదనపు చార్జిషీట్ లో రాజకీయ నేతల పేర్లు చేర్చాలా వద్దా అనే అంశంపై సిట్ అధికారులు తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ విషయంలో న్యాయసలహాలు తీసుకుంటుండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేట్ మెంట్ రికార్డు చేయడంపై ఇప్పటి వరకు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. టెలిఫోన్ యాక్ట్ జోడించి చార్జిషీట్ వేయనుండటం దేశచరిత్రలో ఇదే తొలిసారి అని చెబుతున్నారు. ఈ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కీలకం సూత్రధారిగా సిట్ గుర్తించింది. అయితే ప్రభాకర్ రావు ఇండియాకు రావడం ఆలస్యం కావడంతో విచారణ ఆలస్యం అయినట్లు చెబుతున్నారు. రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు, జడ్జీలు, జర్నలిస్టుల ఫోన్లను ప్రభాకర్ రావు టీమ్ ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులు కనుగొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు అంతకు ముందు జరిగిన బై పోల్ సమయాల్లో పెద్ద ఎత్తున ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తదుపరి దర్యాప్తు సాంకేతికంగా నిలబడేలా సిట్ అధికారులు చార్జిషీట్ రూపొందిస్తున్నట్లు సమాచారం అందుతోంది.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# ఈ20 పెట్రోల్ బంద్ చేస్తారా లేదా..

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ20 పెట్రోల్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ ప్రధాని మోడీ ఇంటి ముట్టడికి బయలుదేరారు. మాజీ మంత్రి మనీష్ సిసోడియా, ఎంపీ సంజయ్ సింగ్, ఇతరులతో కలిసి దేశవ్యాప్తంగా దాదాపు రెండున్నర లక్షల మంది సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ప్రధాని మోడీకి అందజేసేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో ఫిరోజ్ షా రోడ్డు మార్గంలో కేజ్రీవాల్‌ను పోలీసులు అడ్డుకున్నారు. శాంతి భద్రతల సమస్యల దృష్ట్యా ప్రధాని మోడీ ఇంటి వైపు వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. దీంతో పోలీసులు, ఆప్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. తాము శాంతియుతంగా ప్రధానికి వినతి పత్రం అందజేయడానికి వెళ్తున్నామని.. తమను అడ్డుకోవద్దని కేజ్రీవాల్ కోరారు. కానీ పోలీసులు ఇందుకు నిరాకరించారు. దీంతో మనీష్ సిసోడియా, ఆప్ నాయకురాలు జాస్మిన్ షా, ఇతర పార్టీ నాయకులతో కలిసి కేజ్రీవాల్ రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ20 పెట్రోల్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఈ20 ఇంధన విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రెండు లక్షల ముప్పై వేల మందికి పైగా సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ప్రధాని మోడీకి అందజేసేందుకు ఆయన నివాసానికి వెళ్తున్నామని తెలిపారు. ఈ20 పెట్రోల్ కారణంగా ఇబ్బందులు పడుతున్న కోట్లాదిమంది వాహన యజమానుల ఆందోళనలను ప్రభుత్వం వినాలని కోరారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్ కారణంగా దేశంలో కోట్ల వాహనాలు దెబ్బతినే ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ20 పెట్రోల్ తో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వం వారి గోడు ఎందుకు వినడం లేదని ప్రశ్నించారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడితోనే ప్రధాని మోడీ దేశ ప్రజలపై ఇథనాల్‌ను బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపించారు. అమెరికాలోని వ్యర్థ ఇథనాల్‌ను ఇండియాకు దిగుమతి చేస్తున్నారని.. దేశ ప్రజలను మోసం చేయడం సరికాదని చురకలంటించారు. నీట్ కు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన సమయంలో కూడా ప్రభుత్వం ఇలాగే మొండిగా వ్యవహరించిందని.. కానీ చివరకు సర్కార్ తలొగ్గక తప్పలేదన్నారు.



# హరీష్ రావు పశుపతిలా వ్యవహరిస్తున్నారు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీష్ రావు స్వార్థం పరాకాష్టకు చేరిందని, ఆయన రోజు-రోజుకూ పశుపతిలా ప్రవర్తిస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. ఆయన క్షుద్రపూజలు చేస్తున్నారన్నది నిజమని, ఇందులో ఎలాంటి దాపరికం లేదన్నారు. రాష్ట్రంలో వర్షాలు పడకూడదని, పంటలు పండకూడదని కుట్రలు పన్నారని, ప్రజలు కరువుతో అల్లాడిపోవాలని కుతంత్రాలు చేశారన్నారు. సామా రామ్మోహన్, దయాకర్ కు నోటీసులు ఇవ్వడం కూడా అందులో ఒక భాగమని దుయ్యబట్టారు. హరీష్ రావు క్షుద్రపూజలు చేశాడనేందుకు ఉదాహరణలు కూడా ఉన్నాయన్నారు. తమిళనాడులోని తిరుచిరాపల్లి, శివమొగ్గ ప్రాంతాల్లో క్షుద్రపూజలు చేసే దేవాలయాలున్నాయని, అక్కడికి హరీష్ రావు జూన్ 1, మే 31, జులై 23న వెళ్లారనేందుకు ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. అబద్ధమైతే తాము చెప్పిన తేదీల్లో హరీష్ రావు ఎక్కడున్నారో మీడియాకు చెప్పాలని డిమాండ్ చేశారు. హరీష్ సమాధానం చెప్తే.. తాను, సీఎం కూడా బీఆర్ఎస్ అడిగేవాటికి సమాధానం చెప్తామన్నారు. వాస్తవాలు మాట్లాడినందుకు తమ పార్టీ నేతలకు నోటీసులు ఇచ్చినంత ఈజీగా నిజాలు చెప్పలేరన్నారు. శివమొగ్గ వెళ్లిన హరీష్ రావు ఫొటోలను సోషల్ మీడియాలో ఎందుకు పోస్ట్ చేయలేదని ప్రశ్నించారు. తిరుపతి వెళ్తే మీడియాతో మాట్లాడే హరీష్ రావు.. శివమొగ్గలో మీడియాను ఎందుకు అవాయిడ్ చేశారని ప్రశ్నించారు. రాష్ట్రానికి మంచి జరగకూడదని క్షుద్రపూజలు చేయించడం ఎంతవరకూ సబబు ? బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి అఘోర, తాంత్రిక పూజలు చేయిస్తోందన్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్ లో క్షుద్రపూజలు చేయిస్తున్నారంటే నమ్మలేదు కానీ.. ఇప్పుడు హరీష్ రావును చూస్తోంటే అనుమానాలు వస్తున్నాయన్నారు.

# టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉపాధి

**రుద్రంగి,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన ఆధునిక నైపుణ్యాలు అందించి, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీలు)ను ఏర్పాటు చేస్తోందని శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీలు), గనులు & భూగర్భ శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. శిక్షణ నుంచి ఉద్యోగ నియామకాల వరకు విద్యార్థులకు ప్రభుత్వమే అండగా నిలిచే సమగ్ర వ్యవస్థను రూపొందిస్తున్నామని, కోర్సులు పూర్తయ్యాక ఉద్యోగాల కోసం యువత ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంగళవారం వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగిలో నూతన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ భవనానికి మంత్రి శంకుస్థాపన చేసి, అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), ఎలక్ట్రిక్ వాహనాలు, రోబోటిక్స్, డ్రోన్లు వంటి సాంకేతిక రంగాల అభివృద్ధితో ఉద్యోగాల స్వరూపం వేగంగా మారుతోందని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 120 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి, సంప్రదాయ కోర్సుల స్థానంలో అత్యాధునిక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో రుద్రంగి ఏటీసీలో ఆధునిక వ్యవసాయ సాంకేతిక కోర్సును ప్రారంభించే అవకాశాలను పరిశీలించాలని ఉపాధి ఉ శిక్షణ శాఖ (డీఈటీ) డైరెక్టర్ కాంతి వెస్లీకి మంత్రి ఆదేశించారు. ఈ కోర్సు రూపకల్పన కోసం ఇక్రిసాట్‌తో సంప్రదింపులు జరపాలని సూచించారు. ఐటీఐలు, ఏటీసీల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మధ్యలో ఆగిపోకుండా నెలకు రూ.2,000 స్టైపెండ్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. శిక్షణ ఇవ్వడం వరకు మాత్రమే ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రతి విద్యార్థికి ఉద్యోగం వచ్చే వరకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐటీఐలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, మౌలిక వసతులు, ఆధునిక శిక్షణపై ఎలాంటి దృష్టి పెట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీఐలను ఆధునీకీకరించి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందిస్తోందని చెప్పారు. విదేశీ ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రస్తుతం జర్మనీ, జపాన్‌తో పాటు పలు దేశాల్లో నర్సులు, ఎలక్ట్రిషియన్లు, కేర్‌గివర్లు, నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులకు భారీ డిమాండ్ ఉందని తెలిపారు. రుద్రంగి ప్రాంతంలో 100 మంది అర్హులైన యువతను గుర్తిస్తే వారికి జర్మన్ భాషా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక శిక్షకుడిని ప్రభుత్వం పంపుతుందని, శిక్షణ పూర్తయ్యాక టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉద్యోగాలు కల్పించే బాధ్యత కూడా ప్రభుత-్వమే తీసుకుంటుందని వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. వచ్చే వారం నుంచే టామ్‌కామ్ ఆధ్వర్యంలో విదేశీ ఉపాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మందమర్రిలో ఇప్పటికే 100 మంది యువతకు జర్మన్ భాషా శిక్షణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. భాషా నైపుణ్యంతో కూడిన యువత జర్మనీ, జపాన్‌లలో నెలకు రూ.2 లక్షలకు పైగా వేతనాలతో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని, జపాన్‌లో మరిన్ని ఉపాధి అవకాశాలపై కూడా ప్రభుత్వం పరిశీలన కొనసాగిస్తోందన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుపై కూడా మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత కాకా వెంకటస్వామి నాయకత్వంలో రూపుదిద్దుకున్న ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.36 వేల కోట్లు మాత్రమేనని, అప్పటికే దాదాపు రూ.11 వేల కోట్ల పనులు పూర్తయ్యాయని గుర్తుచేశారు. అనంతరం ప్రాజెక్టును కాళేశ్వరంగా మార్చడంతో నిర్మాణ వ్యయం భారీగా పెరగడమే కాకుండా విద్యుత్ వినియోగ భారం కూడా రాష్ట్రంపై పడిందని ఆరోపించారు. గ్రావిటీ ఆధారిత సాగునీటి అవకాశాలను వదిలిపెట్టి విద్యుత్ ఆధారిత ఎత్తిపోతల వ్యవస్థను ఎందుకు ఎంచుకున్నారని ప్రశ్నించారు. దీని వల్ల వేల కోట్ల రూపాయల అదనపు విద్యుత్ ఖర్చు ప్రజలపైనే భారం పడుతోందన్నారు. బ్యారేజీల్లో నిర్మాణ లోపాలు వెలుగులోకి వచ్చిన తర్వాత కూడా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలతో తరచూ ప్రభుత్వాన్ని సంప్రదిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని, పేద కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఆరోగ్య మౌలిక వసతులను కూడా బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను మంత్రి ప్రస్తావించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన నైపుణ్యాభివృద్ధి సమావేశంలో తెలంగాణ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ నమూనాను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా కొత్త నైపుణ్య కోర్సుల రూపకల్పన కోసం కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలో తనకు బాధ్యతలు అప్పగించిందని వెల్లడించారు. పీఎం సేతు పథకం కింద తెలంగాణకు మూడు క్లస్టర్లు దక్కడం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి రంగంలో ముందంజలో ఉందనడానికి నిదర్శనమన్నారు. ఒక్కో క్లస్టర్‌కు సుమారు రూ.200 కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉందని, రాష్ట్రానికి మరిన్ని క్లస్టర్లు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. "తెలంగాణ యువతకు నాణ్యమైన విద్య, ఆధునిక నైపుణ్యాలు, అర్థవంతమైన ఉపాధి కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అత్యున్నత నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేసి దేశీయ, విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి" అని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా కె. అగర్వాల్, డీఈటీ ఉ టామ్‌కామ్ డైరెక్టర్ కాంతి వెస్లీ, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, స్థానిక యువత పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో పెండింగ్ పనులపై కమిషనర్ సీరియస్

**శేరిలింగంపల్లి,ఫ్లాష్ ఇండియా :** శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ అధ్యక్షతన జోనల్ కార్యాలయంలో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యల పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశానికి డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్, సిటీ ప్లానర్, అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు, ఫైనాన్స్ అడ్వైజర్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అధికారులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ తదితర అధికారులు పాల్గొన్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ ఫైళ్లను త్వరగా క్లియర్ చేసి సర్క్యులేట్ చేయాలని ఆదేశించారు. సిబ్బంది జీతాల క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేయాలని, జోన్ పరిధిలో హరితహారం, పార్కుల నిర్వహణ, మొక్కల పెంపకం పనుల పురోగతిని పరిశీలించారు. రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల ఇంజనీరింగ్ పనుల స్థితిగతులపై చర్చించారు. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన 'బిల్డ్ నౌ' పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దోమల నివారణ, సీజనల్ వ్యాధుల అదుపు కోసం జోన్ పరిధిలో ఫాగింగ్ కార్యకలాపాలను మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత గడువులోగా పనులన్నింటినీ పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

# వరంగల్‌కు కేంద్రం నుంచి భారీ శుభవార్త!



**హనుమకొండ,ఫ్లాష్ ఇండియా :** వరంగల్ జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పీఎం గతిశక్తి, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ తదితర కేంద్ర పథకాల కింద వరంగల్‌కు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక ఉందా? ఉంటే ఏయే ప్రాజెక్టులు మంజూరయ్యాయి? వాటి ద్వారా జిల్లాకు ఎలాంటి ప్రయోజనాలు కలగనున్నాయో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చింది. సమాధానంలో భాగంగా, వరంగల్ జిల్లాలో కనెక్టివిటీ మెరుగుపర్చేందుకు సుమారు రూ.7,843 కోట్ల వ్యయంతో 447 కిలోమీటర్ల మేర మూడు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం లభించినట్లు తెలిపింది. అలాగే రూ.6,133 కోట్ల వ్యయంతో 185 కిలోమీటర్ల మేర నాలుగు జాతీయ రహదారి ప్రాజెక్టులు మంజూరైనట్లు పేర్కొంది. అదనంగా, పీఎం మిత్ర పథకం కింద 1,327 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న బ్రౌన్‌ఫీల్డ్ టెక్స్‌టైల్ పార్క్ కోసం సుమారు రూ.1,696 కోట్లు కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# రాష్ట్రంలో మార్పు రావాలి... కాంగ్రెస్ పోవాలి...

రాష్ట్రంలో మార్పు రావాలి... కాంగ్రెస్ పోవాలి ...మా విద్యార్థుల స్కాలర్షిప్ రావాలి -ఎస్ఎఫ్ఐ డిమాండ్ స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసేంతవరకు పోరాడుతాం.




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని రాఘవ టాకీస్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు1500మంది విద్యార్థులతో కలిసి భారీ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్ ఖమ్మం పాటి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద మధ్య తరగతి విద్యార్థుల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని అన్నారు. రాష్ట్రంలో 10,500 కోట్లు బకాయిలు ఉంటే గత ప్రభుత్వం పేరు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది తప్ప బకాయిలో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయడంలో విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక పక్క విద్యార్థులు ఉన్నత చదువులకు పోవాలంటే స్కాలర్షిప్ ఫీజ్ రియంబర్స్మెంట్ రాలేదు కాబట్టి సర్టిఫికెట్ లు ఇవ్వమని విద్యార్థులను ఇబ్బంది పెడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు మూడవత్ రవి నాయక్,మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షా కార్యదర్శులు మూడవత్ జగన్ నాయక్ కుర్ర సైదా నాయక్ , దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న నాయక్,లోహి,ఝాన్సీ,బన్ని, హనుమంతు,పవన్,బిస్మిల్లా,తరుణ్, సిపాయి,కల్పన,రాధిక,కళ్యాణి, స్పందన,శిరీష,కావ్య, అంజలి,మానసా తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థను సీఎం నాశనం చేస్తున్నారు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఇతరుల సహాయం లేకుండా ఎన్నికల నామినేషన్ పత్రం నింపలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్, గ్రాడ్యుయేట్ విద్యార్థుల గురించి మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. రెండో వ్యక్తి సహాయం లేకుండా నామినేషన్ పత్రం నింపగలవా అని సీఎంకు అర్వింద్ ఓపెన్ చాలెంజ్ విసిరారు. చదువు లేని రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖను పెట్టుకోవడానికి సిగ్గులేదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి తన వద్ద ఉన్న విద్యాశాఖను శ్రీధర్ బాబు లాంటి చదువుకున్న వారికి అప్పగించాలన్నారు. రేవంత్ రెడ్డి పరిపాలన, ఆయన ఇస్తున్న స్టేట్‌మెంట్లు అన్నీ తెలంగాణ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేవిధంగా ఉన్నాయని దుయ్యబట్టారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన అర్వింద్.. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతోందని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గత బీఆర్ఎస్ పాలకులు ఇదే రకంగా చెపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మీ మాటలతో ఎవరైనా ఉద్యోగాలు ఇస్తారా?**

65 శాతం క్లాసులు విని పరీక్షలు రాసి పాసైన ఇంజనీరింగ్ విద్యార్థులకు అప్లికేషన్ ఫామ్‌లు నింపడం రాదని ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రపంచంలోనే ఒక రాష్ట్రంలో అత్యధికంగా ఇంజినీరింగ్‌లను తయారు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అలాంటి విద్యార్థుల భవిష్యత్‌ను రేవంత్ రెడ్డి ఏం చేయదలుచుకున్నారని ప్రశ్నించారు. సీఎం ఈ రకంగా మాట్లాడితే మన ఇంజనీరింగ్ పిల్లలకు ఎవరైనా ఉద్యోగాలు ఇస్తారా? ఇప్పుడు ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పరిస్థితి ఏంటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు అదే కార్యక్రమంలో ఉన్న ఉపాధ్యాయులు చప్పట్లు కొట్టడం కూడా చాలా తప్పన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఆడబిల్లలకు టాయిలెట్స్ లేని స్కూల్స్ ఉన్నాయన్నారు. ఉన్న స్కూల్స్ బాగు చేయకపోయినా కమిషన్ల కోసం కొత్త స్కూల్స్ కడుతామంటున్నారని మండిపడ్డారు. టీచర్ల పీఆర్సీ ఇవ్వని ముఖ్యమంత్రి ఉపాధ్యాయుల బాగోగుల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ ఇప్పటికీ ప్రతిపక్ష నేతగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

**తమాషాలు చేస్తున్నావా? లేక టైమ్ పాస్ చేస్తున్నావా?**

గతంలో తాము ఎక్కడికైనా వెళ్తే చెప్పులు ఎత్తుకెళ్లేవారు వచ్చినట్లు మమ్మల్నీ చూస్తున్నారని ముఖ్యమంత్రి మాట్లాడారని అలా మాట్లాడితే ఎవరైనా పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తారా అని నిలదీశారు. నువ్వేం ముఖ్యమంత్రివి? తమాషాలు చేస-్తున్నావా? లేక టైమ్ పాస్ చేస్తున్నావా? అని మండిపడ్డారు. చదివినోళ్లకు చదవనోళ్లకు ఫ్యూచర్ లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. మరో వైపు హైడ్రా పేరుతో రియల్ ఎస్టేట్ పూర్తిగా నాశనం పట్టించారని ఓ వైపు కోర్టు చీవాట్లు పెడుతుంటే రేవంత్ రెడ్డి ప్రొటెక్ట్ చేస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులకు దోచిపెడుతున్నాడని ఆరోపించారు.

## సంపాదకీయం

# శాశ్వత వ్యవస్థకు ప్రత్యామ్నాయమా?

## రాజ్యాంగ నియామకాల స్థానంలో తాత్కాలిక వ్యవస్థ?

ప్రభుత్వ ఉద్యోగాల నియామక వ్యవస్థ ప్రజాస్వామ్య పాలనలో అత్యంత కీలకమైన అంశం. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన అవకాశాలను కల్పిస్తూ, బహిరంగ పోటీ పరీక్షలు, మెరిట్ ఆధారిత ఎంపిక, పారదర్శక నియామక విధానాలను నిర్దేశించింది. ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం ఉపాధి అవకాశమే కాదు; అది సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా పరిపాలన సామర్థ్యానికి ప్రతీక. అయితే గత నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగాల నియామక వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పులు ఈ రాజ్యాంగ స్ఫూర్తిపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అత్యవసర అవసరాల కోసం మాత్రమే ఉద్దేశించిన తాత్కాలిక నియామకాలు నేడు అనేక శాఖల్లో శాశ్వత వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి. ఫలితంగా లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల అవకాశాలు తగ్గిపోతుండగా, ప్రజా నియామక వ్యవస్థపై విశ్వాసం కూడా దెబ్బతింటోంది. పార్ట్‌టైమ్, కంటింజెంట్, కన్సాలిడేటెడ్ పే, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ, హానరేరియం, ఫిక్స్‌డ్ పే... పేర్లు మారినా, అంతర్లీన విధానం మాత్రం ఒకటే. ప్రభుత్వాలు శాశ్వత పోస్టులను భర్తీ చేయాల్సిన చోట తాత్కాలిక నియామకాల ద్వారా పరిపాలన కొనసాగించడం గత కొన్ని దశాబ్దాలుగా సాధారణంగా మారింది. ఒకప్పుడు అత్యవసర పరిస్థితులకు మాత్రమే పరిమితమైన ఈ విధానం నేడు విద్య, వైద్యం, రెవెన్యూ, పోలీసు, స్థానిక సంస్థలు, గ్రామీణాభివృద్ధి, సచివాలయాలు, సామాజిక సంక్షేమం వంటి అనేక రంగాలకు విస్తరించింది. దీంతో తాత్కాలికం అనే పదమే అర్థం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు ఈ విధానాన్ని అవలంబించడానికి పలు కారణాలను ప్రస్తావిస్తుంటాయి. ఆర్థిక పరిమితులు, కొత్త సంక్షేమ పథకాల అమలు, తక్షణ మానవ వనరుల అవసరం, పరిపాలనా సౌలభ్యం వంటి కారణాలతో కాంట్రాక్ట్ లేదా అవుట్‌సోర్సింగ్ విధానాలను సమర్థిస్తాయి. కొన్నిసార్లు ఈ కారణాలు సమంజసంగానే కనిపిస్తాయి కూడా. వరదలు, మహమ్మారులు, ఎన్నికలు, జనగణన వంటి ప్రత్యేక సందర్భాల్లో తాత్కాలిక సిబ్బంది అవసరం అనివార్యమే. అయితే సమస్య అక్కడితో ముగియడం లేదు. తాత్కాలికంగా నియమించిన ఉద్యోగులు సంవత్సరాల తరబడి, కొన్నిసార్లు దశాబ్దాల పాటు అదే పోస్టుల్లో కొనసాగుతుండగా, అదే సమయంలో శాశ్వత పోస్టులు ఖాళీగానే ఉండిపోతున్నాయి. దీంతో తాత్కాలిక వ్యవస్థే శాశ్వత రూపం దాల్చుతోంది. 1980ల నుంచి ప్రభుత్వ శాఖల్లో పార్ట్‌టైమ్, కంటింజెంట్, కన్సాలిడేటెడ్ పే ఉద్యోగాలు విస్తరించాయి. అనంతరం కాంట్రాక్ట్ విధానం ప్రవేశించింది. తర్వాత అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ వేగంగా విస్తరించింది. ప్రతి దశలోనూ "ఇది తాత్కాలికం మాత్రమే" అనే హామీలు వినిపించినా, కాలక్రమేణా ఆ ఉద్యోగులు క్రమబద్ధీకరణ కోసం ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వాలు కూడా పలు సందర్భాల్లో క్రమబద్ధీకరణ నిర్ణయాలు తీసుకున్నాయి. దీంతో మరోవైపు కొత్త నియామకాలకు ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత అవకాశాలు తగ్గిపోయాయి. ఇది ఒక విధంగా తాత్కాలిక ఉద్యోగుల హక్కులు, కొత్త అభ్యర్థుల అవకాశాలు అనే రెండు వర్గాల మధ్య సంఘర్షణకు దారితీసే పరిస్థితిని సృష్టించింది. ఈ పరిణామాల ప్రభావం అత్యంత తీవ్రంగా పడుతున్నది నిరుద్యోగ యువతపై. ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువకులు, యువతులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఏళ్ల తరబడి శ్రమించి, కోచింగ్ తీసుకుని, పరీక్షల కోసం ఎదురుచూస్తున్నారు. కానీ ఖాళీలు ఉన్నప్పటికీ నోటిఫికేషన్లు ఆలస్యం కావడం, లేదా అసలు విడుదల కాకపోవడం వారి భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతోంది. ప్రభుత్వ ఉద్యోగం కోసం జీవితంలో అత్యంత విలువైన సంవత్సరాలను వెచ్చించే యువతలో నిరాశ పెరుగుతోంది. ఈ పరిస్థితి సామాజిక, ఆర్థిక పరమైన ప్రభావాలను కూడా కలిగిస్తోంది. ఇదే సమయంలో తాత్కాలిక ఉద్యోగుల పరిస్థితి కూడా అంత సులభం కాదు. చాలా మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తక్కువ వేతనాలతో, పరిమిత సేవా భద్రతతో, పదోన్నతులు లేకుండా, పెన్షన్ లేదా ఇతర సంక్షేమ ప్రయోజనాలు లేకుండా పనిచేస్తున్నారు. ఒకే కార్యాలయంలో శాశ్వత ఉద్యోగి, తాత్కాలిక ఉద్యోగి ఒకే పని చేస్తున్నా, వేతనం, హక్కులు, భద్రతలో తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. అందువల్ల వారి సంక్షేమం కూడా ప్రభుత్వాల బాధ్యతే. కానీ ఈ సమస్యకు పరిష్కారం శాశ్వత నియామకాలను వాయిదా వేయడం కాదు; మానవ వనరుల ప్రణాళికను సమర్థవంతంగా రూపొందించడమే. గ్రామపంచాయతీ నుంచి రాష్ట్ర సచివాలయం వరకు, ప్రభుత్వ పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనా ఆసుపత్రుల వరకు, రెవెన్యూ కార్యాలయాల నుంచి పోలీసు శాఖ వరకు అనేక విభాగాల్లో మంజూరైన పోస్టులు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పదవీ విరమణల వల్ల ఏర్పడిన ఖాళీలను సకాలంలో భర్తీ చేయకపోవడం, శాఖల వారీగా మానవ వనరుల అంచనాలను క్రమం తప్పకుండా నిర్వహించకపోవడం పరిపాలనా లోపాలను సూచిస్తోంది. ఈ లోటును తాత్కాలిక నియామకాలతో పూడ్చడం తక్షణ పరిష్కారం కావచ్చు; కానీ దీర్ఘకాలిక పరిష్కారం మాత్రం కాదు. అవుట్‌సోర్సింగ్ విధానంపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నియామకాలలో పారదర్శకత, మధ్యవర్తుల పాత్ర, అర్హతల ఎంపిక, వేతనాల్లో కోతలు, బోగస్ ఉద్యోగుల ఆరోపణలు వంటి అంశాలు పలు సందర్భాల్లో చర్చకు వచ్చాయి. కొన్ని రాష్ట్రాల్లో అవుట్‌సోర్సింగ్ సంస్థల ద్వారా నియామకాలపై విచారణలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఇటువంటి పరిస్థితులు ప్రజా ధన వినియోగం, పరిపాలనా పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ వ్యవస్థ కొనసాగాలంటే కఠినమైన పర్యవేక్షణ, స్పష్టమైన నియమాలు, పూర్తి పారదర్శకత అవసరం. మరోవైపు, క్రమబద్ధీకరణ అంశం కూడా సున్నితమైనదే. ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వానికి సేవలందిస్తున్న ఉద్యోగుల భవిష్యత్తు పట్ల ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందే. అయితే అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న కొత్త తరానికి కూడా సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత సాధించడం ప్రభుత్వాల విధానపరమైన బాధ్యత. ఒక వర్గానికి న్యాయం చేస్తూ, మరో వర్గానికి అన్యాయం జరిగే పరిస్థితి తలెత్తకూడదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ప్రతి ఏడాది శాఖల వారీగా మానవ వనరుల ఆడిట్ నిర్వహించడం అవసరం. ఎన్ని పోస్టులు మంజూరయ్యాయి, ఎన్ని ఖాళీగా ఉన్నాయి, ఎన్ని తాత్కాలిక అవసరాల కోసం మాత్రమే అవసరం, ఎన్ని శాశ్వత స్వభావం కలిగినవి అనే అంశాలపై స్పష్టమైన డేటా ప్రజలకు అందుబాటులో ఉండాలి. శాశ్వత అవసరాలకు శాశ్వత నియామకాలు, తాత్కాలిక అవసరాలకు మాత్రమే కాలపరిమితి గల నియామకాలు అనే సూత్రాన్ని కచ్చితంగా అమలు చేయాలి. ప్రతి ఖాళీ పోస్టును నిర్దిష్ట కాలవ్యవధిలో భర్తీ చేసే విధంగా చట్టబద్ధమైన కార్యాచరణ రూపొందించడం కూడా సముచితమే. ప్రభుత్వ నియామక వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలవాలంటే పారదర్శకత, సమయపాలన, రాజ్యాంగబద్ధత తప్పనిసరి. ఉద్యోగ నియామకాలు ఆలస్యం కావడం, పరీక్షలు వాయిదా పడటం, నోటిఫికేషన్లు సంవత్సరాల తరబడి రాకపోవడం వంటి పరిణామాలు యువతలో అసంతృప్తిని పెంచుతాయి. అదే సమయంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు కొనసాగడం ప్రజలకు అందే సేవల నాణ్యతపై కూడా ప్రభావం చూపుతుంది. అందువల్ల ఇది కేవలం ఉద్యోగాల సమస్య కాదు; ప్రజా పరిపాలన సామర్థ్యానికి సంబంధించిన అంశం కూడా. రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల సూత్రం కేవలం పుస్తకాలకే పరిమితం కాకూడదు. ప్రతి అర్హుడైన అభ్యర్థికి ప్రభుత్వ ఉద్యోగం కోసం సమాన అవకాశాన్ని కల్పించే బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. తాత్కాలిక నియామకాలు పరిపాలనకు సహాయక వ్యవస్థగా ఉండాలి తప్ప, శాశ్వత నియామకాల స్థానాన్ని ఆక్రమించే ప్రత్యామ్నాయంగా మారకూడదు. నిరుద్యోగ యువత ఆశలు, తాత్కాలిక ఉద్యోగుల భద్రత, ప్రజా సేవల నాణ్యత, రాజ్యాంగ విలువలు ఈ నాలుగు అంశాల మధ్య సమతుల్యత సాధించినప్పుడే ప్రభుత్వ నియామక వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. అదే ప్రజాస్వామ్య పరిపాలనకు, సమర్థవంతమైన ప్రభుత్వ వ్యవస్థకు, భవిష్యత్ తరాల ఆకాంక్షలకు నిజమైన దిశానిర్దేశం అవుతుంది.

# ప్రపంచ సహకారానికి కొత్త దిశ

ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో ఆర్థిక వ్యవస్థలు పరస్పరం అనుసంధానమవుతున్నాయి. ఒక దేశంలో జరిగే ఆర్థిక నేరాలు, అవినీతి వ్యవహారాలు, మనీలాండరింగ్, అక్రమ ఆస్తుల బదిలీలు మరో దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం విస్తరించడంతో పాటు డిజిటల్ చెల్లింపులు, వర్చువల్ ఆస్తులు, క్రిప్టోకరెన్సీలు, ఫిన్‌టెక్ వేదికలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అవినీతి కూడా కొత్త రూపాలు సంతరించుకుంటోంది. ఈ పరిస్థితుల్లో ఒక్కో దేశం ఒంటరిగా అవినీతిని ఎదుర్కోవడం కష్టసాధ్యంగా మారింది. అందుకే అంతర్జాతీయ సహకారం, సమాచార మార్పిడి, చట్టపరమైన సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలు అత్యంత కీలకంగా మారాయి. ఇలాంటి సమయంలో బ్రిక్స్ దేశాల అవినీతి నిరోధక కార్యాచరణ బృందం సమావేశానికి హైదరాబాద్ వేదిక కావడం విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. 2026 సంవత్సరానికి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆగస్టు 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం రెండో సమావేశం, అలాగే ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ సమావేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ సమావేశాలు కేవలం అధికారిక కార్యక్రమాలు మాత్రమే కావు; భవిష్యత్ ప్రపంచ పరిపాలనకు మార్గదర్శకంగా నిలిచే విధాన చర్చలకు వేదికగా నిలుస్తున్నాయి. బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు ఇటీవల సభ్యత్వం పొందిన దేశాలు కూడా భాగస్వామ్యమవుతున్నాయి. ప్రపంచ జనాభాలో గణనీయమైన వాటా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ దేశాలు అవినీతి నిరోధంలో ఉమ్మడి కార్యాచరణ చేపట్టడం అంతర్జాతీయంగా సానుకూల పరిణామంగా భావించాలి. అవినీతి కేవలం ప్రభుత్వాలకు నష్టాన్ని కలిగించడమే కాదు; అభివృద్ధి ప్రాజెక్టులు ఆలస్యం కావడం, ప్రజా ధనం దుర్వినియోగం కావడం, పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతినడం, సామాజిక అసమానతలు పెరగడం వంటి అనేక ప్రతికూల ప్రభావాలకు కారణవుతుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయింది. గతంలో నగదు రూపంలో జరిగే అవినీతి ఇప్పుడు డిజిటల్ మార్గాల్లో, అంతర్జాతీయ బ్యాంకింగ్ వ్యవస్థల ద్వారా, షెల్ కంపెనీల ద్వారా, వర్చువల్ ఆస్తుల రూపంలో జరుగుతోంది. అక్రమంగా సంపాదించిన ఆస్తులను విదేశాలకు తరలించడం, పన్ను స్వర్గాలుగా పిలవబడే దేశాల్లో దాచిపెట్టడం, తప్పుడు సంస్థల పేర్లతో లావాదేవీలు నిర్వహించడం వంటి పద్ధతులు పెరుగుతున్నాయి. అందువల్ల అక్రమ ఆస్తులను తిరిగి రప్పించడం, నేరస్తులను గుర్తించడం, వారి ఆర్థిక కార్యకలాపాలను పర్యవేక్షించడం కోసం దేశాల మధ్య సమన్వయం అత్యంత అవసరం. హైదరాబాద్ సమావేశంలో ఇదే అంశంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరస్తుల ఆచూకీ గుర్తించడం, వారిని స్వదేశానికి అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయడం, పరస్పర న్యాయ సహకారాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై సభ్యదేశాలు చర్చించనున్నాయి. అనేక దేశాల్లో న్యాయపరమైన విధానాలు వేర్వేరుగా ఉండటం వల్ల నేరస్తుల అప్పగింతలో ఆలస్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పరస్పర అవగాహన ఒప్పందాలు, సమాచార మార్పిడి వ్యవస్థలు, వేగవంతమైన దర్యాప్తు ప్రక్రియలు ఎంతో అవసరం. అవినీతి నిరోధంలో సాంకేతికత పాత్ర కూడా రోజురోజుకు పెరుగుతోంది. కృత్రిమ మేధస్సు, డేటా విశ్లేషణ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలు, ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానాలు ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకతను పెంచుతున్నాయి. ప్రభుత్వ కొనుగోళ్లలో డిజిటల్ విధానాలను అమలు చేయడం ద్వారా అవినీతి అవకాశాలను గణనీయంగా తగ్గించవచ్చు. ప్రభుత్వ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందించడం ద్వారా మధ్యవర్తిత్వం తగ్గి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయి. హైదరాబాద్ సమావేశంలో "ఆవిష్కరణ, సాంకేతికతతో కూడిన నైతిక పరిపాలన" అంశంపై ప్రత్యేక చర్చ నిర్వహించడం ఈ దిశగా సానుకూల అడుగుగా భావించాలి. ప్రపంచంలో అవినీతి సూచికలను పరిశీలిస్తే, పారదర్శక పాలన, బలమైన న్యాయ వ్యవస్థ, స్వతంత్ర దర్యాప్తు సంస్థలు ఉన్న దేశాల్లో అవినీతి స్థాయి తక్కువగా ఉంటుంది. చట్టాల అమలుతో పాటు పరిపాలనా సంస్కరణలు, ప్రజల భాగస్వామ్యం, సమాచార హక్కు, డిజిటల్ సేవల విస్తరణ వంటి చర్యలు అవినీతి నిరోధంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే సభ్యదేశాలు తమ విజయవంతమైన అనుభవాలను పరస్పరం పంచుకోవడం ద్వారా ఉత్తమ విధానాలను అమలు చేసే అవకాశం ఏర్పడుతుంది. భారత్ గత కొన్ని సంవత్సరాలుగా డిజిటల్ పాలనకు పెద్దపీట వేస్తోంది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్, ఆధార్ ఆధారిత సేవలు, డిజిటల్ చెల్లింపులు, ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ , ఈ-ఆఫీస్ వ్యవస్థ, ఈ-ప్రొక్యూర్‌మెంట్ వంటి కార్యక్రమాలు పరిపాలనలో పారదర్శకత పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా చేరడంతో పాటు లీకేజీలను తగ్గించడంలో ఇవి సహాయపడ్డాయి. ఈ అనుభవాలను బ్రిక్స్ దేశాలతో పంచుకోవడం ద్వారా ఇతర దేశాలు కూడా ప్రయోజనం పొందే అవకాశం ఉంది. అయితే అవినీతి నిరోధం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. సమాజం, మీడియా, పౌరసంఘాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, సాధారణ ప్రజలు కూడా ఇందులో భాగస్వాములు కావాలి. అవినీతి జరిగితే ఫిర్యాదు చేసే ధైర్యం, సమాచారాన్ని బయటపెట్టే వ్యవస్థ, విజిల్‌బ్లోయర్ల రక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య వంటి అంశాలు కూడా సమానంగా అవసరం. అవినీతి నిరోధక చట్టాలు ఎంత బలంగా ఉన్నా వాటిని అమలు చేసే వ్యవస్థలు సమర్థంగా లేకపోతే ఆశించిన ఫలితాలు రావు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో జరుగుతున్న బ్రిక్స్ సమావేశం అంతర్జాతీయ సహకారానికి ఒక కొత్త దిశను చూపించే అవకాశం ఉంది. సభ్యదేశాల మధ్య సమాచార మార్పిడి, సంయుక్త దర్యాప్తు, అక్రమ ఆస్తుల గుర్తింపు, డిజిటల్ నేరాల నియంత్రణ, సాంకేతిక సహకారం వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందితే ప్రపంచవ్యాప్తంగా అవినీతి నిరోధానికి అది బలమైన పునాదిగా మారుతుంది. భారత్ అధ్యక్షతన జరుగుతున్న ఈ చివరి బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృంద సమావేశం కావడం వల్ల దీని ప్రాధాన్యం మరింత పెరిగింది. హైదరాబాద్ వంటి అంతర్జాతీయ గుర్తింపు పొందిన నగరం ఈ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం భారత పరిపాలనా సామర్థ్యాన్ని, దౌత్యపరమైన నాయకత్వాన్ని ప్రతిబింబిస్తోంది. ఇది తెలంగాణకు కూడా అంతర్జాతీయ స్థాయిలో మరో గుర్తింపును తీసుకురానుంది. మొత్తానికి, అవినీతి అనేది ప్రపంచ అభివృద్ధికి అతిపెద్ద అడ్డంకుల్లో ఒకటి. దీనిని ఎదుర్కోవాలంటే దేశాలు పరస్పరం పోటీ పడటం కంటే సహకరించాలి. అక్రమ ఆస్తుల రికవరీ, నేరస్తుల అప్పగింత, సాంకేతికత ఆధారిత పారదర్శక పాలన, నైతిక పరిపాలన, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాల్లో బ్రిక్స్ దేశాలు తీసుకునే ఉమ్మడి నిర్ణయాలు భవిష్యత్ తరాలకు మరింత పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన, అవినీతి రహిత ప్రపంచ పరిపాలనకు పునాది వేయగలవు. హైదరాబాద్ సమావేశం ఆ దిశగా ఒక కీలక మైలురాయిగా నిలవాలని ఆశిద్దాం.

# సమానత్వం, సామాజిక న్యాయం...



దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల అంశం మరోసారి జాతీయ చర్చకు కేంద్రబిందువైంది. ఒకవైపు సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కులు, సమాన ప్రాతినిధ్యం కోసం బహుజన వర్గాలు తమ స్వరాన్ని బలంగా వినిపిస్తుండగా, మరోవైపు "రిజర్వేషన్ హఠావో" వంటి నినాదాలు కొత్త రాజకీయ, సామాజిక చర్చలకు దారితీస్తున్నాయి. ఈ పరిణామాలు కేవలం రిజర్వేషన్ల కొనసాగింపుపై వివాదం మాత్రమే కాదు; భారత సమాజంలో సమానత్వం, చారిత్రక అన్యాయాల పరిహారం, రాజ్యాంగ స్ఫూర్తి వంటి ప్రాథమిక అంశాలపై మరోసారి విస్తృతమైన చర్చ అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. భారత సామాజిక చరిత్రను పరిశీలిస్తే, కుల ఆధారిత అసమానతలు, వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలే సమాజాన్ని ముందుకు నడిపించాయి. అయితే ప్రతి సామాజిక న్యాయ ఉద్యమానికి ప్రతిస్పందనగా ఆధిపత్య రాజకీయాలు కొత్త రూపాల్లో పునరావృతమవుతూ వచ్చాయి. నేడు కూడా రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం వెనుకబడిన వర్గాల పోరాటం కొనసాగుతుండగా, అదే సమయంలో రిజర్వేషన్ విధానాన్ని పునఃసమీక్షించాలన్న లేదా రద్దు చేయాలన్న డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో జరిగిన వివిధ ప్రజా ఉద్యమాలు దేశ రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీశాయి. వాటికి ప్రతిస్పందనగా "రిజర్వేషన్ హఠావో" అనే డిజిటల్ ప్రచారం ప్రారంభమై, కుల ఆధారిత రిజర్వేషన్ల స్థానంలో మెరిట్ లేదా ఆర్థిక ప్రాతిపదికను ప్రధాన ప్రమాణంగా పరిగణించాలని కొందరు వాదిస్తున్నారు. మరోవైపు, రిజర్వేషన్లకు మద్దతు ఇచ్చే వర్గాలు మాత్రం భారత సమాజంలో కుల ఆధారిత అసమానతలు ఇంకా పూర్తిగా తొలగిపోలేదని, అందువల్ల రాజ్యాంగం కల్పించిన రక్షణాత్మక చర్యలు ఇప్పటికీ అవసరమేనని పేర్కొంటున్నాయి. చరిత్రను వెనక్కి తిరిగి చూస్తే, రిజర్వేషన్ విధానాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన సందర్భాలు గతంలో కూడా కనిపించాయి. రాజ్యాంగ అమలు అనంతర పరిణామాలు, మండల్ కమిషన్ సిఫార్సుల అమలు సమయంలో జరిగిన ఆందోళనలు ఇందుకు ఉదాహరణలుగా ప్రస్తావించబడుతున్నాయి. ఆ కాలంలోనూ సామాజిక న్యాయం, సమాన అవకాశాల అంశాలపై దేశవ్యాప్తంగా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ చారిత్రక అనుభవాలు నేటి చర్చలకు కూడా ప్రాసంగికంగా నిలుస్తున్నాయి. ఇక్కడ ప్రధానంగా తలెత్తుతున్న ప్రశ్న ఏమిటంటే దేశంలో ఇంకా కొనసాగుతున్న కుల వివక్ష, సామాజిక అసమానతల నేపథ్యంలో రిజర్వేషన్ల అవసరం ముగిసిందా? లేక సమాజంలోని అన్ని వర్గాలు నిజమైన సమాన స్థాయికి చేరుకునే వరకు ఈ విధానం కొనసాగాల్సిన అవసరం ఉందా? ఈ ప్రశ్నకు సమాధానం కేవలం రాజకీయ నినాదాల్లో కాదు; సామాజిక వాస్తవాలు, రాజ్యాంగ విలువలు, గణాంకాలు, ప్రజాస్వామ్య లక్ష్యాల ఆధారంగా అన్వేషించాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగ దృష్టిలో రిజర్వేషన్లు దానం కాదు, దయ కాదు, మెరిట్‌కు వ్యతిరేకమైన విధానం కూడా కాదు. చారిత్రకంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే ఒక రాజ్యాంగబద్ధమైన సాధనం. సమాన పోటీకి అవసరమైన పరిస్థితులను సృష్టించడం ద్వారా సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. అందువల్ల రిజర్వేషన్లపై జరిగే ప్రతి చర్చ రాజ్యాంగ స్ఫూర్తి, సమానత్వం, సామాజిక న్యాయం అనే మూడు మూల సూత్రాల చుట్టూనే సాగాలి. అయితే, మరోవైపు రిజర్వేషన్ విధానాల అమలు, ప్రభావం, భవిష్యత్ దిశపై నిర్మాణాత్మక చర్చ కూడా అవసరమే. సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి లక్ష్యాన్ని మరింత సమర్థవంతంగా సాధించేలా విధానాలను సమీక్షించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే. అయితే ఆ చర్చ వాస్తవాలపై ఆధారపడి ఉండాలి; విభజనను పెంచే నినాదాలపై కాదు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉన్నప్పటికీ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాంగ విలువలు అనే ప్రాథమిక సూత్రాల విషయంలో జాతీయ ఏకాభిప్రాయం అవసరం. రిజర్వేషన్లపై జరుగుతున్న తాజా చర్చ కూడా అదే దిశగా సాగితేనే భారత గణతంత్రం ఆశించిన సమానత్వ సమాజ నిర్మాణానికి అది దోహదపడుతుంది. సమాజంలోని ప్రతి వర్గానికీ గౌరవప్రదమైన స్థానం, సమాన అవకాశాలు, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం కల్పించడమే రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యం. ఆ లక్ష్య సాధనలో రిజర్వేషన్లపై చర్చ విభజనకు కాదు, సమానత్వానికి దారి చూపేలా ఉండటం కాలానుగుణ అవసరం.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ఏటీఎంల వద్ద కిలాడీ ముఠా దందా..

**రామచంద్రాపురం/అమీన్‌పూర్,ఫ్లాష్ ఇండియా :** జనావాసాలు లేని ఏటీఎం కేంద్రాలకు వచ్చే అమాయకులను, వృద్ధులను మాటు వేసి మాటలతో నమ్మిస్తారు. ఏటీఎంల వద్ద డబ్బు డ్రా చేయడంలో సహాయం చేస్తామని ఒప్పిస్తా- రు. బాధితుల పిన్ నెంబర్ తెలుసుకుని, అసలు కార్డుకు బదులుగా మరో కార్డును ఇచ్చి మోసాలకు తెరలేపుతారు. జీడిమెట్ల ప్రాంతంలో రూమ్ తీసుకొని వివిధ గ్రూపులుగా ఏర్పడి అక్కడి నుంచి ఆపరేట్ చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను కిష్టారెడ్డిపేట్‌లో ఒక వ్యక్తి ఏటీఎం నుంచి 60 వేలు అపహరించిన సంఘటనతో అమీన్ పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో ఏసీపీ శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి నిందితులను అరెస్ట్ చేశారు.

**అమాయకులే టార్గెట్‌గా మోసాలు..**

నిందితులు గ్రూప్‌లుగా ఏర్పడి జనావాసాలు తక్కువ ఉన్న బ్యాంక్‌లు, ఏటీఎంల వద్ద డబ్బు డ్రా చేయడంలో సహాయం చేస్తామని నమ్మించి బాధితుల పిన్ నెంబర్ తెలుసుకుని, అసలు కార్డుకు బదులుగా మరో కార్డు ఇచ్చి మోసాలకు పాల్పడుతుంటారు. అనంతరం దొంగిలించిన కార్డులతో వివిధ ఏటీఎంల నుంచి నగదు డ్రా చేయడంతో పాటు స్వైప్ మెషీన్ల ద్వారా లావాదేవీలు నిర్వహించి బాధితుల ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. బాధితులు తేరుకునేలోపే నిమిషాల్లోపే నగదు ఇతర రాష్ట్రాల అకౌంట్‌లలోకి వెళ్ళిపోతుంది.

**కిష్టారెడ్డిపేట్ ఘటనతో నిందితుల అరెస్ట్..130 ఏటీఎం కార్డులు స్వాధీనం**

తాజాగా కిష్టారెడ్డిపేట్ లోని ఒక ఏటీఎంలో నగదు డ్రా చేయడానికి వెళ్లిన వ్యక్తికి స హాయం చేస్తున్నట్లు నటిస్తూ నగదు రావట్లేదంటూ ఏటీఎం మార్చి రూ. 60 వేలు కొట్టేశాడు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి కిష్టారెడ్డి పేట్ ఘటనతో ఆరుగురిని అదుపులోకి తీసుకొనగా మరో 8 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 130 ఏటీఎం కార్డులు, రెండు పీఓఎస్ స్వైప్ మెషీన్లు, మూడు ఆటోరిక్షాలు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ. 27,230 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సైబరాబాద్‌తో పాటు హర్యానా రాష్ట్రంలోనూ ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన అమీన్‌పూర్ పోలీసు అధికారులు, సిబ్బంది కృషిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

**అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: పోలీసుల సూచన**

ఏటీఎం కేంద్రాల వద్ద అపరిచితుల స హాయం తీసుకోవద్దని, ఏ పరిస్థితుల్లోనూ ఏటీఎం పిన్ నంబర్‌ను ఎవరికీ చెప్పవద్దని, తమ ఏటీఎం కార్డును ఇతరులకు ఇవ్వవద్దని పోలీసులు సూచించారు. ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని లేదా 100కు డయల్ చేసి పోలీసుల సహాయం కోరాలని విజ్ఞప్తి చేశారు.



## హైడ్రా అనేది ప్రజలను వేధించే సంస్థ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైడ్రాపై మరోసారి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు కురిపించారు. హైడ్రా అనేది ప్రజలను వేధించే సంస్థ అని మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారులను నియమించే విచక్షణాధికారం ఉండొచ్చు కానీ ఇండ్లు కూలగొట్టే అధికారం లేదని అన్నారు. హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హైడ్రా స్థాపించామని రేవంత్ రెడ్డి చెప్పాడని, హిట్లర్ ఎంతో విధ్వంసం సృష్టించారని అన్నారు. ప్రజలపై అగఘాయిత్యాలకు పాల్పడ్డారని అన్నారు. ఇప్పుడు హిట్లర్ ప్రజలను వేధించినట్టే హైడ్రా ద్వారా రేవంత్ రెడ్డి ప్రజలను వేధిస్తున్నాడని మండిపడ్డారు. హైడ్రా అనేది పేదల ఇండ్లు కూలగొట్టే సంస్థగా ప్రజలు నిర్ధారించారని వ్యాఖ్యానించారు. నలభై, యాభై ఏళ్ల క్రితం తెలంగాణ నలుమూలల నుండి వచ్చి చెరువుల, కాలువల పక్కన కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూల్చివేశారని అన్నారు. తమకు కావాల్సిన వారికి భూములు కట్టబెట్టేందుకు, తమకు వ్యతిరేకంగా ఉన్నవారిని బ్లాక్‌మెయిల్ చేయడానికే రేవంత్ రెడ్డి హైడ్రాను వాడుతున్నాడని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో హైడ్రాను చూసి భయపడి, ఇల్లు కొనేందుకు కూడా ప్రజలు భయపడుతున్నారని ఈటల వ్యాఖ్యానించారు. హైడ్రా రెవెన్యూ, మున్సిపల్, హోం డిపార్ట్మెంట్ అన్ని డిపార్ట్మెంట్ల కంటే సుప్రీం డిపార్ట్మెంట్ గా వ్యవహరిస్తోందన్నారు. కోర్టుల మాట కూడా వినడంలేదని, చివరికి రేవంత్ రెడ్డి మాట కూడా హైడ్రా వింటుందో ఏదో అనే అనుమానం వస్తుందని అన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై కాంగ్రెస్ ఫోకస్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో మరోసారి ఎన్నికల సంగ్రామం మొదలు కాబోతోంది. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనుండటంతో పార్టీలు ఈ ఎన్నికలపై దృష్టి సారించాయి. ఈ రెండు స్థానాలపై ఫోకస్ పెట్టిన అధికార కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అవసరమైన వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లా ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా అభిప్రాయ సేకరణ ప్రక్రియ ప్రారంభించారు.

**సమర్థవంతమైన అభ్యర్థికోసం వేట:**

హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పట్టభద్రుల నియోజకవర్గం ఉంది. దీంతో ఇక్కడి నుంచి సమర్థవంతమైన అభ్యర్థిని బరిలోకి దించేందుకు పార్టీ పరంగా పొన్నం అభి- ప్రాయాలు సేకరిస్తున్నారు. అభ్యర్థి ఎంపికకు సంబంధించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకుల నుంచి లిఖితపూర్వకంగా అభిప్రాయాలను మంత్రి పొన్నం కార్యాలయం చేపట్టింది. పార్టీ బలోపేతానికి, సమర్థవంతమైన అభ్యర్థి ఎంపికకు స్థానిక నాయకుల అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలించి పార్టీ అధిష్ఠానానికి నివేదిస్తామని తెలిపారు.

**ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి:**

హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ఇంచార్జిలు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు సమన్వయంతో విజయవంతం చేయాలని, ప్రతి నియోజకవర్గంలో లక్ష్యాలకు అనుగుణంగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# కెమికల్స్ తో కల్తీ మసాలా తయారీ..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ రాయుళ్లపై హైదరాబాద్ పోలీసులు, 'హెచ్-ఫాస్ట్' (H-FAST - హైదరాబాద్ ఆహార కల్తీ నిఘా బృందం) ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న 13 మసాలా వ్యాపార సంస్థల్లో హెచ్-ఫాస్ట్ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో సోదాల్లో భాగంగా అధికారులు 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడి పదార్థాలను స్వాధీనం చేసుకుని మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సిటీ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ దాడులకు సంబంధించిన వివరాలను ఇవాళ హైదరాబాద్ సీపీ సజ్జనార్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

**ప్రమాదకర కెమికల్స్ వినియోగం:**

తిరస్కరించబడిన, నాణ్యత లేని దినుసులతో పాటు మసాలాల్లో సింథటిక్ రంగులు, బట్టల డైలు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ కలర్స్ మరియు రైస్ బ్రాన్ ఆయిల్ ఉపయోగించి కల్తీ మసాలా దినుసులు త- యారు చేస్తున్నట్లు సజ్జనార్ వెల్లడించారు. ప్రధానంగా వాము, జీలకర్ర, షాజీరా, లవంగాలు వంటి నిత్యం వాడే మసాలా దినుసులను కల్తీ చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. అల్లం వెల్లుల్లి పేస్టులో టైటానియం ఆక్సైడ్ వంటి ప్రమాదకరమైన కెమికల్స్ వినియోగిస్తున్నట్లు చెప్పారు. నిందితులు ఈ కల్తీ మసాలా తయారీ విధానాన్ని ఇండోర్ తదితర ప్రాంతాల్లో నే- ర్చుకున్నారని వెల్లడించారు.

**నీటితో కడిగినా పోని రసాయనాలు:**

ఈ కల్తీల్లో వాడిన కొన్ని రకాల రసా- యనాలు అత్యంత ప్రమాదరమైనవని సీపీ తెలిపారు. నీటితో కడిగినా కూడా పోవని అందువల్లే సామాన్య ప్రజలు వీటిని గుర్తించలేకపోతున్నారని చెప్పారు. ఇలాంటి విషపూరిత పదార్థాలు తినడం వల్ల లివర్, కిడ్నీలు దెబ్బతినడమే కాకుండా అల్సర్, క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని చెప్పారు.

**హత్యాయత్నం కేసులు నమోదు:**

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీదారులపై ఇకపై ఉపేక్షించేది లేదని సీపీ హెచ్చరించారు. ఇలాంటి కేసుల్లో నిందితులపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 110 కింద హత్యాయత్నం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. హెచ్-ఫాస్ట్ విభాగాన్ని ఏర్పాటు చేసిన నాటి నుంచి గత 140 రోజుల్లో అధికారులు 659 దాడులు నిర్వహించారు. మొత్తం 202 కేసుల్లో దాదాపు 246 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నగరంలో ఎక్కడైనా కల్తీ ఆహారం తయారు చేస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు అనుమానం వస్తే ప్రజలు వెంటనే హెచ్-ఫాస్ట్ హెల్ప్‌లైన్ నంబర్ 8712661212 కి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**ములుగు,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం విద్యా వైద్య రంగానికి అధిక నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేస్తుందని, పలు రకాల వ్యాధులతో బాధపడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి దనసరి అనసూ- య(సీతక్క) అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి నూతన సదరం శిబిరం, యుడిఐడి భవనాన్ని, ఆక్సిజన్ ప్లాంట్, అర్థో, గైనిక్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టి విభాగాలకు సంబంధించిన నాలుగు ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య శాఖ మంత్రి దామోదర నరసింహ పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందని, రానున్న రోజుల్లో జిల్లా కేంద్రంలో ప్రత్యేక డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, జిల్లా ఆసుపత్రి ఇరుకుగా ఉన్న కారణంగా మరో ఆసుపత్రి ఏర్పాటుకు చూపుతున్నామని అన్నారు. గతంలో కన్నా ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందడం ఆశించదగ్గ విషయమని, ప్రైవేట్ హాస్పిటల్స్ కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి చంద్ర శేఖర్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## అవినీతి ఫుల్... తనిఖీలు మాత్రం శూన్యం..?

**మణుగూరు,ఫ్లాష్ ఇండియా :** మణుగూరు మున్సిపాలిటీలో సుమారు 3 కోట్ల రూ- పాయల గోల్ మాల్ జరిగినా వాటిపై చర్యలు శూన్యం. కొనుగోలు చేసిన వాహనాల జాడ మచ్చుకైనా కానరావడం లేదు. అసలు ఆ వాహనాల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మున్సిపాలిటీ కార్యాలయంలో లేని వాహనాలను చూపించి ప్రస్తుతం ఉన్న కమిషనర్లు వాటి మరమ్మతుల పేర్లతో బిల్లులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినా కానీ వాటిపై చర్యలు తీసుకొని నాథుడే కరువయ్యారు. జటాయు వాయనం -1, స్వీపింగ్ మిషన్‌లు 2 ఒక్కొక్కటి 50 లక్షలు, చెత్తను సేకరించే ఆటోలు 10, సబ్ స్టేషన్ మెషిన్ , ఇంటెక్ వెల్ దగ్గర సీసీ కెమెరాల ఏర్పాటు, 200 వరకు మణుగూరు పురపాలక సంఘం పేరు మీద సిమెంట్ బల్లాలు, ట్రాక్టర్లు 3, ఏసీలు 2, చెత్తను కోసే మిషన్స్ 2, గడ్డిని కోసే మిషన్స్ 2, ఫాగింగ్ మిషన్లు పెద్దవి 2, స్ప్రే పంపు మిషన్ లు 4 ఇవేవీ మున్సిపల్ కార్యాలయంలో కానరావు. అయినా సరే ఏ ఒక్క అధికారి కూడా ఇటు వైపు కూడా కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఇందులో కొన్ని వాహనాలు మరమ్మతులకు గురై కార్యాలయానికే పరిమితమయ్యాయి. ఇంత జరిగినా అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అధికారులకు ముడుపులు అందుతున్నాయని, అందుకే మణుగూరు మున్సిపాలిటీ పై అధికారులు దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్ళు తెరిచి మణుగూరు మున్సిపాలిటీ పై చర్యలు తీసుకుంటారో లేక పట్టించుకోకుండా వదిలేస్తారో వేచి చూద్దాం.

# యూరియా కోసం రైతుల అవస్థలు..

**యూరియా కొరతతో రైతులకు తీవ్ర ఇబ్బందులు యాప్ ఆధారిత పంపిణీ విధానంపై బీఎస్పీ ఆందోళన చౌటుప్పల్ ఆర్డీఓకు బీఎస్పీ వినతిపత్రం**



**మునుగోడు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** యూరియా ఎరువుల కొరత, యాప్ ఆధారిత పంపిణీ విధానం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి ఐతరాజు అభయేందర్ అన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం చౌటుప్పల్ ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలకు ప్రస్తుతం యూరియా అత్యవసరంగా అవసరమైన సమయంలో రైతులు ఎరువుల కోసం దుకాణాల చుట్టూ తిరుగుతున్నా, సరిపడా నిల్వలు లేక నిరాశతో వెనుదిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చే శారు. యాప్ ద్వారా మాత్రమే యూరియా బుకింగ్ తప్పనిసరి చేయడంతో సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు, వృద్ధులు, నిరక్షరాస్యులు, చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో యూరియా నిల్వలను అందుబాటులో ఉంచాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలపై వస- స్తున్న ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం వెంటనే ఈ క్రింది చర్యలు చేపట్టాలని కోరారు: ప్రతి ఎరువుల దుకాణంలో తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలి.

యాప్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానంలో కూడా యూరియా పంపిణీ చేయాలి. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలపై ప్రత్యేక విజిలెన్స్ బృందాలతో తనిఖీలు నిర్వహించాలి. రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడకుండా టోకెన్ లేదా గ్రామాల వారీగా పంపిణీ వ్యవస్థ అమలు చేయాలి. జిల్లాలోని ప్రతి మండలానికి అవసరమైన మేరకు అదనపు యూరియా నిల్వలను వెంటనే కేటాయించాలి. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో ప్రత్యేక నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ఎరువుల నిల్వలు, పంపిణీ వివరాలను ప్రతిరోజూ ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలి. రైతుల పంటలను కాపాడాలంటే యూరియా కొరతను వెంటనే నివారించి, ప్రతి అర్హ రైతుకు సకాలంలో ఎరువులు అందేలా ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి కత్తుల పరమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి బొట్ట శివ, నియోజకవర్గ అధ్యక్షుడు తగరం శుభాష్ చంద్రబోస్, నియోజకవర్గ కోశాధికారి మాధ రమేష్, నారాయణపురం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల గిరి, సీనియర్ నాయకులు ఎర్రోళ్ల వెంకటయ్య, కత్తుల నర్సింహ, కురిమిద్ద యాదయ్య, ఖైతాపురం శివ, రైతులు మల్లయ్య, శివయ్య, అబ్బయ్య, ఈశ్వరయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# తొలి స్వదేశీ టర్బోజెట్ ఇంజిన్ డెలివరీ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎయిరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో హైదరాబాద్ మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ 350 కేజీ థ్రస్ట్-క్లాస్ టర్బోజెట్ ఇంజిన్ డెలివరీ విజయవంతంగా పూర్తయింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ ఆజాద్ ఇంజనీరింగ్ మరియు డీఆర్‌డిఓ సంయుక్తంగా సాధించిన ఈ విజయం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. గత 10 ఏళ్లలో హైదరాబాద్ ఎయిరోస్పేస్, ప్రిసిషన్ ఇంజనీరింగ్ రంగాలు సాధించిన అద్భుతమైన పురోగతికి ఈ జెట్ ఇంజిన్ తయారీ, డెలివరీయే స్పష్టమైన నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు.

**ఆత్మనిర్భర భారత్ దిశగా కీలక అడుగు:**



డిఫెన్స్ ప్రొపల్షన్ రంగంలో భారత్ ఇతర దేశాలపై ఆధారపడకుండా, స్వయంసమృద్ధి సాధించే క్రమంలో ఇది ఒక విప్లవాత్మక పరిణామమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ స్థాయి ఎయిరోస్పేస్ హబ్‌గా ఎదిగిన హైదరాబాద్ ఘనత ఈ రికార్డుతో మరింత పెరిగిందని, ప్రతి ఏటా నగర బ్రాండ్ పవర్ సరికొత్త శిఖరాలను చేరుకుంటోందని కేటీఆర్ అభినందించారు.

# ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపుతాం...

రౌడీ షీటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన మిర్యాలగూడ ఇంచార్జ్ డీఎస్పీ జి.రవి
నేరాలకు దూరంగా ఉండాలి-చట్టాన్ని గౌరవించి ప్రశాంత జీవనం సాగించాలి





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్గొండ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ లో భాగంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ సబ్‌డివిజన్ పరిధిలో, ఇంచార్జ్ డీఎస్పీ జి. రవి రౌడీ షీటర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్ సీఐ పి.ఎన్.డి ప్రసాద్, మిర్యాలగూడ వన్ టౌన్,సీఐ నాగభూషణ్,టూ టౌన్ సీఐ సోమ నర్సయ్య,మరియు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ లక్ష్మయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ డీఎస్పీ జి. రవి మాట్లాడుతూ, "రౌడీయిజం,బెదిరింపులు, దౌర్జన్యాలు,అక్రమ వసూళ్లు,ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఇకపై నేరాలకు పాల్పడే ప్రతి ఒక్కరిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే నిర్బంధ చర్యలు కూడా చేపడతాం" అని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు తమ నివాసం మార్చినా,పోలీస్ స్టేషన్ పరిధి దాటి ఇతర ప్రాంతాల్లో నివసించాలన్నా ముందస్తుగా సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసుల పిలుపు మేరకు విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని, కోర్టు విధించిన బెయిల్ షరతులను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అక్రమ ఆయుధాలు కలిగి ఉండడం, బాధితులు లేదా సాక్షులను బెదిరించడం, గొడవలు సృష్టించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు తేలితే రౌడీ షీట్ కొనసాగించడంతో పాటు ఇతర నివారణ చర్యలు కూడా అమలు చేస్తామని తెలిపారు. అలాగే "రౌడీ షీట్ శిక్ష కాదు. నేరాలను నిరోధించేందుకు, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు తీసుకునే ముందస్తు చర్య. అయితే పర్యవేక్షణలో ఉన్న వ్యక్తులు మళ్లీ నేరాలకు పాల్పడితే చట్టం తన పని తాను చేస్తుంది. ఎవరినీ విడిచిపెట్టేది లేదు"అని హెచ్చరించారు. ఎవరైనా తమ ప్రవర్తనలో నిజమైన మార్పు తీసుకువచ్చి, నిర్దేశిత కాలం పాటు ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా ఉంటే, సంబంధిత నిబంధనల ప్రకారం వారి రౌడీ షీట్ మూసివేతను సమర్థ అధికారి పరిశీలించే అవకాశం ఉంటుందని తెలిపారు. సమాజంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని,సత్ప్రవర్తనతో జీవించాలని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా రౌడీ షీటర్లలో చట్టంపై అవగాహన పెంపొందించడంతో పాటు,నేరాలకు దూరంగా ఉండి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించేలా ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి





**నల్గొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రజలు, యువత, విద్యార్థులు అందరం కలిసి మాదక ద్రవ్య సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో నషా ముక్త్ భారత్, మిషన్ స్పందన్ మరియు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, కళాశాల ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి విభాగాల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యసన విముక్తి ప్రతిజ్ఞ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ తరాలు మారేకొద్దీ పిల్లల ఆట పాటలు, వ్యసనాలు కూడా మారుతున్నాయని తన స్వీయ అనుభవాన్ని సభికులతో పంచుకున్నారు. ఇప్పుడు మందు, సిగరెట్ తో పాటు సామాజిక మాధ్యమాల వ్యసనం, డిజిటల్ వ్యసనం, డ్రగ్స్ వినియోగం పెరిగిందని అన్నారు. ఒకప్పుడు డబ్బున్న వారికి మాత్రమే డ్రగ్స్ అందుబాటులో ఉండేవని, ఇప్పుడు కిరాణా షాపు లో కూడా దొరుకుతున్నాయని అన్నారు. దీనికి వ్యవస్థతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతా వహించాలని అన్నారు. గత మే నెలలో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగశీ వల్ల జరిగే నష్టాల గురించి కూడా అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ఇప్పటి జెన్జి తరం డ్రగ్స్ ఫ్రీ తరంగా ఉండాలని సూచించారు. యువతరం అనేక కారణాల వల్ల మాదక ద్రవ్యాల భారిన పడుతున్నారని దాని వల్ల కెరీర్ నాశనం అవుతుందని తెలుసుకోవాలన్నారు. డ్రగ్స్ తీసుకోకుండా నిగ్రహం పాటించాలని ఒక్కసారి డ్రగ్స్ కు అలవాటు పడితే వ్యక్తిగతంగా, కుటుంబం, సమాజం ప్రభావితమవుతాయని అన్నారు. ఒక దశలో ఏకాకితనం ఆవహిస్తుందని అన్నారు. ఒక వేళ ఎవరైనా మాదక ద్రవ్యాల భారిన పడితే ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ చుట్టు పక్కల ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నా, డ్రగ్స్ తీసుకొమ్మని బలవంతపెట్టినా, అమ్మినా 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలో 97 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయని అన్నారు. 2047 భారత స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి మన దేశం ప్రపంచంలోనే మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే ముందు డ్రగ్స్ తీసుకోవడం లాంటి అలవాట్లను యువత పక్కకు పెట్టాలని పేర్కొన్నారు. కళాశాలలోని ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి విభాగాలను అభినందించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారు ఇలాంటి ఒక సామాజిక కార్యక్రమాన్ని చేపట్టి దాన్ని ముందుకు తీసుకుపోవడం అభినందనీయమని అన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిరోధక పోస్టర్ ను ఆవిష్కరించారు. అదనపు సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ రమేష్ విద్యార్థులచే మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, నల్లగొండ ఇంచార్జి రాజయోగి ధనలక్ష్మి మాట్లాడుతూ భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్పం మేరకు మాదక ద్రవ్య రహిత భారతదేశం, ఆరోగ్యకరమైన భారతదేశం, అభివృద్ధి చెందిన భారతదేశం నిర్మాణం కొరకు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, వైద్య విభాగం ఈ మహాఉద్యమం చేపట్టిందని తెలిపారు. పది కోట్ల మంది యువత చేత ఈ ప్రతిజ్ఞ చేయించడం లక్ష్యమని అన్నారు. మాదక ద్రవ్య వ్యసన విముక్తి కావడం అనేది జీవిత సమస్య అని అన్నారు. మానసికంగా బలహీనంగా ఉంటేనే డ్రగ్స్ తీసుకుంటారని నవ నిర్మాణ యువత వాటి భారిన పడకూడదని సూచించారు. మొబైల్ వ్యసనం చాల ప్రమాదకరమని టాయిలెట్లో కన్నా 18 శాతం ఎక్కువ బ్యాక్టీరియ మొబైల్ స్క్రీన్ మీద ఉంటుందని తెలిపారు. మాదక ద్రవ్యాల సేవనం వల్ల నిద్రలేమితనం, చదువు మీద దృష్టి కేంద్రీకరించక పోవడం లాంటివి కలుగుతాయని అన్నారు. ఆగస్టు 6 నుంచి 20 వరకు దేశంలోని అన్ని విద్యాసంస్థల్లోని విద్యార్థులు ఈ మాదక ద్రవ్య వ్యసన విముక్తి ప్రతిజ్ఞ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా వైద్యాధికారి డా. కె. రాహుల్, జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ ఆర్. మదన్ మోహన్, తెలుగుశాఖ అధ్యక్షులు డా. వెల్దండి శ్రీధర్, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కుమారి మోనిక, ఎన్ సి సి ఆఫీసర్ లెఫ్టినెంట్ సిహెచ్ సుధాకర్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్లు, వెంకట్ రెడ్డి, అనిల్ కుమార్, కోటయ్య, మల్లేశం, శివరాణి, సావిత్రి, శిరీష, బ్రహ్మకుమారీస్, ఎన్ సి సి క్యాడెట్స్, ఎన్ సి సి వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పత్రికా ప్రకటన
తేది 04-07-2026
మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం
(జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపు)

# ముఖ్యమంత్రి కార్యాలయానికి ఉత్తరాల పంపిణీ



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్రంలో బీసీ విద్యార్థుల పెండింగ్ ఫీజు బకాయిలు 8 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడ నుండి ముఖ్యమంత్రి కార్యాలయానికి ఉత్తరాల పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువు కోవాలంటే లక్షలు ఖర్చు చేసే పరిస్థితి ఏర్పడ్డది ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులను ఫీజులు కట్టాలి అని యాజమాన్యాలు వేధిస్తూ ఉంటే దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు చదువులను మానిసే పరిస్థితి మన తెలంగాణలో ఏర్పడడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ సిద్ధం రాజు, నియోజకవర్గ నాయకులు మునగాల శైలేందర్, బీసీ జేఏసీ పట్టణ నాయకులు దాసరాజు జయరాజ్,సైదా నాయక్,రవీందర్ నాయక్, రమేష్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరుగురు ఉపాధ్యాయులు సస్పెండ్

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** సిద్దిపేట మల్టీ పర్పస్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కే హైమావతి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్లితే... 2026 జూలై 28వ తేదీన సిద్దిపేట పట్టణంలోని మల్టీ పర్పస్ హైస్కూల్ ను జిల్లా కలెక్టర్ కే హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలలో లేక పోవడం, వార్షిక ప్రణాళిక డైరీలు రాయక పోవడం, ముఖ గుర్తింపు లో 50 శాతం వరకు విద్యార్థులు హాజరు నమోదు లేక పోవడం మొదలగు అంశాలను కలెక్టర్ గుర్తించారు. పాఠశాల నిర్వహణ లో తీవ్రమైన నిర్లక్ష్యం అసహనం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ ప్రత్యేక కమిటీ ద్వారా సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని జిల్లా విద్య శాఖ అధికారిని ఆదేశించారు. నివేదిక ఆధారంగా జీ. బాలముకుంద శర్మ (ఎస్ ఏ తెలుగు), అక్బర్ ఉన్నీసా (ఎస్ ఏ జీవశాస్త్రం), నికత్ సుల్తానా (ఎస్ ఏ హిందీ), రాజేందర్ (ఎస్ ఏ హిందీ), నాగరాణి (ఎస్ ఎ తెలుగు), సుభద్ర రాణి (ఎస్ఏ సాంఘిక)లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కే హైమావతి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీదేవి నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అదే విధంగా ఎఫ్ ఆర్ ఎస్ లో నిర్లక్ష్యం వహించిన సీఆర్పీలు క్రాంతి కుమార్, సవితల పనితీరుపై విచారణ జరిపి నివేదిక ఆధారంగా శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా లోని మిగతా పాఠశాలల లో కూడా విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై తీవ్రమైన క్రమ శిక్షణా చర్యలు ఉంటాయని కలెక్టర్ కే హైమావతి హెచ్చరించారు.



# స్పీడ్ బ్రేకర్లు ,సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తాం..

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జడ్చర్ల -కోదాడ హైవేపై మిర్యాలగూడ మండల పరిధిలోని వెంకటాద్రిపాలెంలోని జంకుతండాకు వెళ్లే క్రాస్ వద్ద సీసీ కెమెరాలు స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేసి ప్రమాదాలు నిర్వహిస్తామని హైవే డిఇ బాలు, ఏఈ నవీన్ కుమార్,ప్రమాదాల నివారణ సీఐ అంజయ్య తెలిపారు. మంగళవారం ఇటీవల ప్రమాదం జరిగి మృత్యువాత పడిన ప్రదేశాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. భారీగా వాహనాలు క్లాసులు అవుతుండడం జరుగుతుండడం పరిశీలించామని తక్షణం నివారణ చర్యల కోసం స్పీడ్ బ్రేకర్లు,సిగ్నల్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వివాహన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బిజెపి మండల కార్యదర్శి విజయ్ నాయక్, పకీర,కాలు,దినేష్,శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు

# అల్ప్రాజోలంతో కల్తీ కల్లు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కల్తీ కల్లు తయారీకి ఉపయోగపడే అల్ప్రాజోలంను సరఫరా చేస్తున్న ముఠా గుట్టును ఈగల్ అధికారులు మంగళవారం భగ్నం చేశారు. ఈగల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈగల్ అధికారులకు అందిన సమాచారంతో తెల్లవారు జామున 3 గంటల సమయంలో పోలీసులు హైదరాబాద్‌లోని మచ్చ బొల్లారం రుక్మిణి ఎన్‌క్లేవ్ వద్ద మాటువేశారు. బ్రీజా కారులో వచ్చిన నలుగురు రుక్మిణి ఎన్‌క్లేవ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఆగారు. మరో ఇద్దరు కారు వద్దకు వచ్చి కిలోకు పైగా ఉన్న అల్ప్రాజోలంను ఇస్తుండగా ఈగల్ అధికారులు వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ప్రభాకర్ గౌడ్, మనోజ్ గౌడ్, సతీష్ గౌడ్, ఎస్. వెంకటేష్ గౌడ్, సీహెచ్. వెంకటేష్ గౌడ్, ప్రశాంత్ గౌడ్‌లు ఒక ముఠాగా ఏర్పడి అల్ప్రాజోలంను తయారీదారుల నుంచి సేకరించి వాటిని కల్లు కాంపౌండ్‌లకు, ఇతరులకు విక్రయిస్తున్నట్లు తేలింది. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు తెల్లవారుజామున, అర్ధరాత్రి సమయాల్లోనే వీటిని సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాల్లో భారీగా సంపాదిస్తున్న ఈ ముఠా అత్యాశకు పోయి అక్రమంగా ఈ మత్తు దందా చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ అల్ప్రాజోలం తయారీకి ఫైనాన్స్ చేస్తున్నట్లు కూడా పోలీసుల దర్యాప్తులో బయటపడింది. ఈ ముఠాతో సంబంధాలు ఉన్న వారిపై ఈగల్ అధికారులు నిఘా పెట్టారు. ఈ సందర్భంగా 1.189 కిలోల అల్ప్రాజోలం, రూ.5 లక్షల నగదు, మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# నల్లవాగు ప్రాజెక్ట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే..

**నారాయణఖేడ్,ఫ్లాష్ ఇండియా :** సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్ట్‌ను మంగళవారం అధికారులతో కలిసి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో ప్రాజెక్ట్ నీటి నిల్వలు, కాలువల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ... ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు సరిగ్గా పడవని వాతావరణ శాఖ ప్రకటించినప్పటికీ, ప్రకృతి సహకారంతో తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వానికి ప్రకృతి సైతం అండగా నిలుస్తోందని అన్నారు. ప్రాజెక్ట్ పరిశీలన సమయంలో స్థానిక రైతులు ఎమ్మెల్యే గారిని కలిసి మాట్లాడారు. "సార్.. ఈసారి వర్షాలు సకాలంలో పడటంతో మేము ముందుగానే నాట్లు వేశాం. మా పొలాలు నిండు కుండలా మారాయి. పంటలకు నిజంగా అవసరమున్నప్పుడే నల్లవాగు ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయండి" అని రైతులు స్వయంగా ఎమ్మెల్యే ను కోరారు. ప్రాజెక్ట్ నీటి విడుదలపై నిన్న మీడియా సమావేశంలో మాజీ



ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. "రైతులకు నీళ్లు ఇవ్వడం లేదని విమర్శించడానికి భూపాల్ రెడ్డికి సిగ్గుండాలి. గత పాలనలో రెండు పంటలను ఎండబెట్టిన ఘనత ఆయనదే. కేవలం తన సొంత చెరువులు, పంటలను నింపుకోవడానికే ఆలోచించిన ఆయన, ఎన్నడూ సామాన్య రైతుల సంక్షేమం గురించి పట్టించుకోలేదు. కేవలం రైతులను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారు." ప్రాజెక్ట్ నీటిని అనవసరంగా వృధా చేయకుండా, పంటలకు అవసరమైన సమయంలోనే వదలాలనేది తమ ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. రైతుల మేలు కోసం నిరంతరం అధికారులతో సమీక్షిస్తున్నామని తెలిపారు.

# ఈ షాకింగ్ విషయం తెలుసా?





భారత క్రికెట్ చరిత్రలో దిగ్గజ ఆటగాడు, క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ కెరీర్ గురించి ప్రతి ఒక్కరికీ తెలిసిందే. అయితే లిటిల్ మాస్టర్ గురించి చాలా మందికి తెలియని ఓ ఆసక్తికర సంఘటన ఉంది. దాయాది పాకిస్థాన్ టీమ్ తరఫున సచిన్ ఫీల్డింగ్ చేశాడు. భారత జట్టు తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేయడానికి రెండేళ్ల ముందు పాక్ తరఫున ఫీల్డింగ్ చేశాడు. అప్పటికి సచిన్ వయసు కేవలం 13 సంవత్సరాలు మా-త్రమే. ఈ ఘటన 1987లో చోటుచేసుకుంది. 1987లో పాకిస్థాన్ జట్టు భారత పర్యటనకు వచ్చింది. ముంబైలోని బ్రబోర్న్ స్టేడియంలో ఇండో-పాక్ జట్ల మధ్య 40 ఓవర్ల మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లో పాక్ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్, జావేద్ మియాందాద్, అబ్దుల్ ఖాదిర్ మైదానం వీడారు. దాంతో పాక్ జట్టుకు ప్రత్యామ్నాయ ఫీల్డర్లు అవసరమయ్యారు. దీంతో క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కెప్టెన్ హేమంత్ కెంక్రేను పాక్ సారథి ఇమ్రాన్ ఖాన్ సంప్రదించి.. స్థానిక యువ ఆటగాళ్లను ఫీల్డింగ్‌కు పంపించాలని కోరాడు. కెంక్రే ఆటగాళ్ల కోసం చూస్తుండగా.. యువ సచిన్ టెండూల్కర్ ఉత్సాహంగా కనిపించాడు. ఆపై పాకిస్థాన్ జట్టు గ్రీన్ జెర్సీ ధరించి సచిన్ మైదానంలోకి అడుగుపెట్టాడు. ఆ మ్యాచ్‌లో సచిన్ టెండూల్కర్ అద్భుతంగా ఫీల్డింగ్ చేశాడు. అప్పటి భారత కెప్టెన్ కపిల్ దేవ్ కొట్టిన బంతి.. సచిన్ ఉన్న అవుట్‌ఫీల్డ్ వైపు రావడంతో బాల్ అందుకున్నాడు. ఆపై రెండేళ్లకు టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చాడు. భారత్ తరఫున 200 టెస్టులు, 463 వన్డేలు, ఒక టీ20 మ్యాచ్ ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 34 వేలకు పైగా రన్స్ చేశాడు. అయితే పాకిస్థాన్ తరఫున ఫీల్డింగ్ చేయడం క్రికెట్ అభిమానుల్లో చర్చ-నీయాంశంగా మారింది. ఈ విషయాన్ని సచిన్ తన ఆత్మకథ 'Playing It My Way'లో కూడా ప్రస్తావించాడు. "ఒకప్పుడు నేను పాకిస్థాన్ జట్టు తరఫున ఫీల్డింగ్ చేశానని ఇమ్రాన్ ఖాన్‌కు గుర్తుందో లేదో నాకు తెలియదు' అని పేర్కొన్నాడు. సచిన్ టెండూల్కర్ చిన్ననాటి స్నేహితుడు మార్కస్ కౌటో కూడా ఈ సంఘటనను గుర్తు చేసుకున్నాడు. మ్యాచ్ అనంతరం ఇద్దరూ కలిసి ముంబై లోకల్ రైలులో ఇంటికి వెళ్తుండగా.. సచిన్ కొంత నిరాశగా కనిపించాడని తెలిపాడు. బౌండరీ లైన్ దగ్గర ఫీల్డింగ్ పెట్టారని, తనవైపు వచ్చిన భారీ షాట్ క్యాచ్ అయ్యేదా అని అడిగాడని, కానీ అది స్టేడియం మొదటి అంతస్తులోకి వెళ్లిపోయిందని తాను చెప్పానని మార్కస్ వెల్లడించాడు. ఆ మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. అనంతరం రెండేళ్లకే సచిన్ భారత జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. అదే పాకిస్థాన్‌పై.. వసీం అక్రమ్, వకార్ యూనిస్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కొంటూ తన చిరస్మరణీయ అంతర్జాతీయ ప్రయాణాన్ని ప్రారంభించాడు.

# ఎన్ని సెంచరీలు కొట్టినా వేస్ట్!!



టీమిండియా దిగ్గజ క్రికెటర్ అజింక్య రహానే ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా వేదికగా ఓ భావోద్వేగ వీడియో సందేశం ద్వారా తన రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. రహానే భారత్ తరఫున మూడూ ఫార్మాట్లలోనూ ప్రాతినిధ్యం వహించినప్పటికీ, టెస్ట్ క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. అయితే, టీ20లలోనూ రహానే ఓ అరుదైన రికార్డును నెలకొల్పాడు. నేటి తరం యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ కూడా తన సుదీర్ఘ కెరీర్‌లో ఈ రికార్డును ఎప్పటికీ బద్దలు కొట్టలేరు. ఇక, ప్రస్తుతం భారత క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ పేరు మారుమోగిపోతోంది. వైభవ్ మైదానంలోకి దిగితే ఏదో ఒక రికార్డు నమోదవాల్సిందే. అత్యంత పిన్న వయస్సులోనే టీమిండియా తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేయడం నుంచి, తన విధ్వంసకర బ్యాటింగ్‌తో వేగవంతమైన సెంచరీలు, హాఫ్ సెంచరీలు సాధించడం వరకు వైభవ్ చెలరేగిపోతున్నాడు. కానీ, రహానే పేరు మీద ఉన్న ఒకే ఒక్క టీ20 రికార్డును మాత్రం వైభవ్ తన జీవితంలో ఎప్పటికీ అధిగమించలేడు.

**రహానే పేరు మీద ఉన్న ఆ ప్రత్యేక రికార్డు ఏమిటి?**

టీ20 అంతర్జాతీయ అరంగేట్రం (డెబ్యూ) మ్యాచ్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అజింక్య రహానే రికార్డు సృష్టించాడు. 2011లో ఇంగ్లాండ్‌పై జరిగిన తన తొలి టీ20 మ్యాచ్‌లో రహానే 61 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. గత 15 ఏళ్లలో టీమిండియా తరఫున టీ20ల్లోకి అరంగేట్రం చేసిన ఏ ఆటగాడు కూడా ఈ స్కోరును దాటలేకపోయారు. మరోవైపు వైభవ్ సూర్యవంశీ విషయానికి వస్తే, గతేడాది ఇంగ్లాండ్‌పైనే టీ20 అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు వైభవ్. అయితే ఆ డెబ్యూ మ్యాచ్‌లో వైభవ్ కేవలం 14 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. కాబట్టి 15 ఏళ్ల వైభవ్ తన రాబోయే కెరీర్‌లో అత్యంత వేగవంతమైన ఫిఫ్టీలు, సెంచరీలు ఎన్ని సాధించినా.. అరంగేట్ర మ్యాచ్‌లోనే అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా రహానే నెలకొల్పిన రికార్డును బద్దలు గొట్టలేకపోయాడు.



# షమీని ఎంపిక చేయకపోవడానికి కారణం అదేనా!


భారత సీనియర్ బౌలర్ మహ్మద్ షమీ భవిష్యత్తుపై చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. గాయం కారణంగా జట్టుకు దూరమైనప్పటికీ.. దేశవాళీలో అద్భుతంగా రాణిస్తున్న సంగతి తెలిసిందే. అయినా జాతీయ జట్టు నుంచి అతడికి పిలుపు అందడం లేదు. తాజాగా స్టార్ పేసర్ బుమ్రా గాయం కారణంగా శ్రీలంకతో జరగనున్న టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో షమీని కాకుండా.. యువ పేసర్ ఆకిబ్ నబీని బీసీసీఐ రిప్లేస్ చేసింది. దీనిపై అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. షమీని ఎందుకు ఎంపిక చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ షమీ భవిష్యత్తుపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. మహ్మద్ షమీ చివరి సారిగా 2023లో భారత జట్టు తరఫున టెస్టు మ్యాచ్ ఆడాడు. గాయాల నుంచి కోలుకున్న తర్వాత రంజీ ట్రోఫీలో వరుసగా ఆకట్టుకునే ప్రదర్శనలు చేసినప్పటికీ జాతీయ జట్టులోకి తిరిగి పిలుపు రాలేదు. ఈ విషయంపై అజిత్ అగార్కర్ స్పందించాడు. టెస్టు క్రికెట్ ఆడేందుకు అవసరమైన ఫిట్‌నెస్ ప్రస్తుతం షమీకి లేదని స్పష్టం చేశాడు. అందుకే షమీని జాతీయ జట్టులోకి ఎంపిక చేయడం లేదని తెలిపాడు. అయితే గత ఏడు రంజీ మ్యాచ్‌ల్లో షమీ 37 వికెట్లు తీసి మూడు సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించాడు. అదే సీజన్‌లో ఆకిబ్ నబీ 60 వికెట్లు పడగొట్టి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. దీంతో శ్రీలంక టెస్టు సిరీస్‌కు అతడికి అవకాశం లభించింది. ఆకిబ్ నబీ ఎంపికతో షమీకి బీసీసీఐ పంపిన సందేశం స్పష్టమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. టెస్టు జట్టులోకి తిరిగి రావాలంటే దేశవాళీ టోర్నీల్లో యువ పేసర్ల కంటే మెరుగైన ప్రదర్శన చేయడమే కాకుండా పూర్తి ఫిట్‌నెస్‌ను కూడా నిరూపించుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇకపై యువ పేసర్లు కేవలం జట్టులో సంఖ్యను పెంచడానికి కాకుండా, తుది జట్టులో చోటు కోసం నేరుగా సీనియర్లతో పోటీ పడుతున్న పరిస్థితి ఏర్పడిందని విశ్లేషిస్తున్నారు.

# భారత క్రికెటర్ల గాయాల వెనుక డ్రామాలు...



బిజీ షెడ్యూల్ కారణంగా భారత క్రికెటర్లు ఈ మధ్య కాలంలో గాయాల బారిన పడుతున్న సంగతి తెలిసిందే. హార్దిక్ పాండ్యా, నితీష్, హర్షిత్ ఇప్పటికే గాయాల బారిన పడగా, లేటెస్ట్ గా బూమ్ బూమ్ బుమ్రా కూడా గాయపడ్డాడు. శ్రీలంకతో ఈ నెలలో జరిగే రెండు టెస్టుల సిరీస్ కు సెలెక్ట్ అయిన బుమ్రాకు కూడా గాయం కావడంతో భారత జట్టు శిబిరంలో కొత్త టెన్షన్ మొదలైంది. అయితే ఈ పరిణామాల నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి అలర్ట్ అయింది. శ్రీలంకతో జరిగే టెస్ట్ సిరీస్ పూర్తయిన తర్వాత హై లెవెల్ రివ్యూ మీటింగ్ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఫిజియోథెరపిస్టు కమలేష్, భారత జట్టు డాక్టర్ రిజ్వాన్ పనితీరుపైన రివ్యూ చేసేందుకు సిద్ధమైందట. ప్లేయర్లు ఫిట్ కాకముందే.. బరిలోకి దింపుతున్నారనే అనుమానం వ్యక్తం చేసిన బీసీసీఐ.. రివ్యూ నిర్వహించేందుకే సిద్ధమైనట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఒకవేళ తమ అనుమానాలు నిజమే అయితే... గౌతమ్ గంభీర్ నుంచి మొదలుకొని అందరిపై చర్యలు తీసుకునేందుకు కూడా సిద్ధమవుతున్నారట. దీంతో భారత జట్టు కోచింగ్ డిపార్ట్మెంట్ లో కొత్త టెన్షన్ మొదలైంది.

# బిజినెస్



# వాట్సాప్ సేవలకు అంతరాయం..

ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ సేవల్లో సోమవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ ప్రపంచవ్యాప్తంగా తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. నార్మల్ మెసేజ్ లు సెండ్ అయినప్పటికీ.. ఫోటోలు, వీడియోలు, స్టిక్కర్లు వంటి మల్టీమీడియా ఫైళ్లను పంపలేకపోతున్నామని ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది వినియోగదారులు ఎక్స్ వేదికగా మెటా సంస్థకు ఫిర్యాదులు చేశారు. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6:45 గంటల సమయంలో ప్రారంభమైన ఈ సమస్య కారణంగా యూజర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే, కొన్ని గంటల అనంతరం సేవలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి. రాత్రి 10:15 గంటల నాటికి ఔటేజ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ 'డౌన్‌డిటెక్టర్' లో అంతరాయం పై ఫిర్యాదులు తగ్గడంతో సేవలు పునరుద్ధరణ పొందినట్లు స్పష్టమైంది. ఈ సాంకేతిక లోపానికి గల కారణాలపై వాట్సాప్ మాతృ సంస్థ మెటా ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. సాధారణ టెక్స్ట్ మెసేజ్‌లు వెళ్తున్నప్పటికీ.. గ్యాలరీ నుంచి ఏ విధమైన మీడియా ఫైళ్లను పంపినా రీట్రై అని వస్తోందని, ముఖ్యంగా ఆండ్రాయిడ్ వినియోగదారులే ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొన్నారని యూజర్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. ఈ అంతరాయానికి 'వాట్సాప్ బీటా ఆండ్రాయిడ్ వెర్షన్ 2.26.31.2' అప్‌డేట్‌లోని బగ్గే కారణమని, వినియోగదారులు ఆ వెర్షన్‌ను ఇన్‌స్టాల్ చేయవద్దని 'డబ్ల్యూఏబీటాఇన్ఫో' ఒక పోస్ట్‌లో పేర్కొనడంతో సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే.. ఈ బీటా అప్‌డేట్‌కు, సేవలకు కలిగిన అంతరాయానికి సంబంధం ఉందో లేదో మెటా లేదా వాట్సాప్ యాజమాన్యం ధృవీకరించాల్సి ఉంది.

# ఈ20 పెట్రోల్‌పై కేంద్రం క్లారిటీ..




దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్‌పై చర్చ కొనసాగుతోంది. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకం వల్ల వాహనాల మైలేజ్ తగ్గుతోందని, ఇంజిన్‌లోని కొన్ని భాగాలపై ప్రభావం పడుతోందని పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనానికి ప్రత్యేక ధర నిర్ణయించాలని, సాధారణ పెట్రోల్‌కు ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకురావాలని కొన్ని సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ20 పెట్రోల్‌పై తన వైఖరిని స్పష్టం చేసింది. ప్రభుత్వం ప్రకారం, ఈ20 పెట్రోల్‌ను ప్రవేశపెట్టిన ప్రధాన ఉద్దేశం పెట్రోల్‌ను చౌకగా చేయడం కాదు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురుపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గించడం, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడం దీని ప్రధాన లక్ష్యమని తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో వచ్చే హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ20 ఇంధనంలో 20 శాతం ఇథనాల్, 80 శాతం పెట్రోల్ ఉంటుంది. ఈ ఇథనాల్‌ను దేశీయంగా చెరకు, మొక్కజొన్నతో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల నుంచి తయారు చేస్తారు. పెట్రోల్‌లో కొంత భాగాన్ని దేశీయంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌తో భర్తీ చేయడం ద్వారా విదేశాల నుంచి ముడి చమురు దిగుమతుల అవసరం తగ్గుతుందని ప్రభుత్వం వివరించింది. దీంతో దిగుమతి వ్యయం తగ్గడమే కాకుండా, దేశీయ ఇంధన వనరుల వినియోగం పెరుగుతుందని తెలిపింది. భారతదేశం తన ముడి చమురు అవసరాల్లో ఎక్కువ భాగాన్ని విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. అందువల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగితే దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలపై కూడా ప్రభావం పడుతోంది. పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని పెంచడం ద్వారా ఈ ఆధారపడటాన్ని తగ్గించి, భవిష్యత్తులో చమురు ధరల హెచ్చుతగ్గుల ప్రభావాన్ని కొంత మేర నియంత్రించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. 2022 నుంచి 2026 మధ్య కాలంలో ప్రపంచంలోని అనేక దేశాల్లో పెట్రోల్ ధరలు 20 నుంచి 40 శాతం వరకు పెరిగాయని ప్రభుత్వం తెలిపింది. అదే సమయంలో భారత్‌లో ఇంధన ధరలు కేవలం 5.6 శాతం మాత్రమే పెరిగాయని పేర్కొంది. అలాగే ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ (EBP) ద్వారా సుమారు 31 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురు దిగుమతులను భర్తీ చేయడంతో పాటు, రూ. 1.90 లక్షల కోట్లకు పైగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసినట్లు వెల్లడించింది. ఇథనాల్ వినియోగం పెరగడం వల్ల రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం చెబుతోంది. చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు మార్కెట్ లభించడం ద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొంది. అదే సమయంలో దేశీయంగా ఉత్పత్తి చేసిన ఇంధన వినియోగం పెరగడం వల్ల విదేశీ మారకద్రవ్య వ్యయం కూడా తగ్గుతుందని వివరించింది. మొత్తంగా, ఈ20 ఇంధనం లక్ష్యం పెట్రోల్ ధరను తగ్గించడం కాదని, భారతదేశాన్ని ఇంధన పరంగా మరింత స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం, ముడి చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, భవిష్యత్తులో అంతర్జాతీయ చమురు సంక్షోభాలు లేదా ధరల పెరుగుదల ప్రభావాన్ని తగ్గించడం ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# స్థిరంగా బంగారం ధరలు..



దేశంలో బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అమెరికా-ఇరాన్ చర్చల నేపథ్యంలో ముడి చమురు ధరలు తగ్గడంతో పసిడి పరుగులకు బ్రేకులు పడ్డాయి. గత రెండు సెషన్స్‌లో పసిడి ధ-రల్లో చెప్పుకోదగ్గ మార్పులు చోటుచేసుకోలేదు. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం (ఆగస్టు 4) ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,44,220గా ఉంది. 22 క్యారెట్లు 10 గ్రాముల పసిడి ధర రూ. 1,32,190 వద్ద కొనసాగుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,08,150గా ఉంది.

Telecom Regulatory Authority of India
TRAI

# కాల్స్‌కు స్టార్ రేటింగ్

బిజినెస్ బ్యూరో: టెలికాం సేవల నాణ్యతపై వినియోగదారుల అభిప్రాయాన్ని నేరుగా సేకరించేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తన 'మైకాల్' యాప్‌కు భారీ అప్‌డేట్ తీసుకొచ్చింది. కొత్త వెర్షన్‌లో వినియోగదారులు ప్రతి వాయిస్ కాల్ ముగిసిన వెంటనే 1 నుంచి 5 స్టార్‌ల వరకు రేటింగ్ ఇవ్వడంతో పాటు, కాల్ డ్రాప్‌లు, వాయిస్ క్వాలిటీ, నెట్‌వర్క్ సమస్యలు వంటి అంశాలను వెంటనే నివేదించే అవకాశం కల్పించింది. కాల్ ముగిసిన తర్వాత ఆటోమేటిక్‌గా ఫీడ్‌బ్యాక్ అడిగే ఫీచర్‌ను కూడా చేర్చింది. ఇప్పటివరకు సేవల నాణ్యతపై మాత్రమే దృష్టి పెట్టిన ట్రాయ్, ఇకపై వినియోగదారుల కాలింగ్ ఎక్స్‌పీరియన్స్ కూడా ఈ యాప్ ద్వారా అంచనా వే-యనుంది. ప్రస్తుతం ఈ అప్‌డేట్ ఆండ్రాయిడ్ వినియోగదారులకు అందుబాటులో ఉంది. 2018లో ప్రారంభమైన తర్వాత 'మైకాల్' యాప్‌కు ఇదే తొలి అప్‌గ్రేడ్ కావడం గమనార్హం. వినియోగదారులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సంబంధిత టెలికాం కంపెనీలతో పంచుకోవడం ద్వారా నెట్‌వర్క్ లోపాలను గుర్తించి, సేవలను మెరుగుపరచేందుకు ఇది ఉపయోగపడుతుందని ట్రాయ్ ఛైర్మన్ అనిల్ కుమార్ తెలిపారు. అదే సమయంలో, ఈ యాప్ ద్వారా సేకరించిన సమాచారాన్ని టెలికాం కంపెనీలపై చర్యలకు ఉపయోగించమని కూడా స్పష్టం చేశారు. యాప్‌లో ఫీడ్‌బ్యాక్ హిస్టరీ చూడడం, కవరేజ్ టెస్ట్‌లు నిర్వహించడం వంటి అదనపు సదుపా-యాలు కూడా ఉన్నాయి.




## డీప్ ఫేక్‌కు గురైన మృణాల్ ఠాకూర్..

సాంకేతిక ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మానవ జీవితాన్ని వేగంగా మార్చే- స్తుందనడంలో అతిశయోక్తి లేదు. వైద్యం, విద్య, సమాచార రంగాలు, సినిమా పరిశ్రమ వరకు అన్ని రంగాల్లో ఏఐ వాడకం విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా సినిమా సెలబ్రిటీల ఫోటోలు, వీడియోలను మార్చి డీప్‌ఫేక్స్ క్రియేట్ చేయడం ఎక్కువైపోయింది. తమ పేరును, రూపాన్ని కాపాడుకోవడానికి ఇప్పటికే చాలామంది హీరోహీరోయిన్లు కోర్టులకు వెళ్లారు. ఇప్పుడు అదే బాటలో యంగ్ బ్యూటీ మృణాళ్ ఠాకూర్ కూడా తన డీప్‌ఫేక్స్ తయారు చేస్తున్న వారిపై తీవ్రంగా మండిపడ్డారు. ఎవరి అనుమతి తీసుకోకుండా ఇతరుల రూపాన్ని ఏఐ ద్వారా వాడటం చట్టరీత్యా నేరమని, ఇలాంటి పనులను అస్సలు ఒప్పుకోలేమని మృణాళ్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్పష్టం చేశారు. తన రూపాన్ని వాడుతూ డీప్‌ఫేక్ వీడియోలు చేయడం లేదా వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. వెంటనే ఈ పనులను ఆపేయాలని, దీన్ని ఒక వార్నింగ్‌గా తీసుకోవాలని ఆమె సూచించారు.ఇకపైనా తన పేరును, రూపాన్ని తప్పుగా వాడితే కచ్చితంగా లీగల్ యాక్షన్ తీసుకుంటానని చాలా ఘాటుగా హెచ్చరించారు. మృణాల్‌తో పాటు గతంలో రష్మిక మందన్న నకిలీ వీడియో వైరల్ అయినప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద వివాదం నడిచింది.




## ఆ సినిమా ఎప్పుడు వస్తుందో నాకే తెలియదు..

ప్రజెంట్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో సందడి చేస్తున్నాడు కోలీవుడ్ స్టార్ సూర్య. వెంకీ అట్లూరి దృకత్వంలో సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' త్వరలోనే రిలీజ్ కాబోతుండగా.. ప్రస్తుతం వరుస ఇంటర్వ్యూస్ బిజీగా ఉన్నాడు సూర్య. ఎంత బిజీగా ఉన్నప్పటికీ తాజాగా బాలీవుడ్‌కు చెందిన ఓ మీడియాకు మ్యాగజైన్ కవర్ పేజ్ కోసం ఫొటో షూట్ ఇవ్వడంతో పాటు.. ఆ ఇంటర్వ్యూలో పాల్గొని తన తదుపరి చిత్రాలపై కూడా ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చాడు. ఈ మేరకు ఆయన జీతు మాధవన్ దర్శకత్వంలో నటిస్తున్న సూర్య 47 గురించి మాట్లాడుతూ.. 'Suriya47 షూటింగ్ ఇప్పుడే పూర్తయింది. ఇటీవలే భారీ విజయాన్ని సాధించిన #BALA (బాలా) చిత్ర దర్శకుడు జీతు మాధవన్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని నా సొంత నిర్మాణ సంస్థ (బ్యానర్)లో నిర్మిస్తున్నాను. ఈ సినిమాను ఈ ఏడాది చివరి నాటికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు' అని తెలిపారు. అలాగే లోకేష్ కనకరాజు దర్శకత్వంలో రాబోతున్న రోలెక్స్ సినిమా గురించి మాట్లాడుతూ.. '=శీశ్రీవఞ - లోకేష్ ఏం చేస్తున్నారో నాకు తెలియదు.. ఆయన ఇప్పటికే అల్లు అర్జున్ సినిమాతో బిజీగా ఉన్నారు.. ఆయన చేతిలో విక్రమ్ 2 కూడా ఉంది.. కానీ ఇంటర్వ్యూలలో మాత్రం 'రోలెక్స్' ఉంటుందని ఆయన చెప్పడం చూస్తున్నాను.. అది ఎప్పుడు జరుగుతుందో కాలమే సమాధానం చెబుతుంది' అంటూ చేసిన షాకింగ్ కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట వైరల్‌గా మారాయి.

## కెరీర్ ప్రారంభంలో నేర్చుకున్న పాఠాలే..

ఒకవైపు 'రేంజర్' సినిమా పాట షూటింగ్ ముగించుకుని, వెంటనే మరోవైపు 'గపూర్' ప్రాజెక్ట్ పాట షూటింగ్‌కి వెళ్లేదాన్నని చెప్పారు. ఆ సమయంలో తనకు రోజుకు కేవలం ఆరు గంటల నిద్ర మాత్రమే దక్కేదని వెల్లడించారు.ఎంత బిజీగా ఉండేదంటే, కనీసం డ్యాన్స్ రిహార్సల్స్ చేయడానికి కూడా తనకు సమయం ఉండేది కాదని తెలిపారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో ఉన్న ఒక వైఖరిపై ఆమె స్పందిస్తూ.. నటనకు ప్రాధాన్యం ఇచ్చే నటులు వేరు, డ్యాన్స్ చేసేవారు వేరు అంటూ అనవసరమైన విభజనలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. గతంలో నటనతో పాటు అద్భుతమైన డ్యాన్స్‌తో మెప్పించిన నటీనటులు ఎంతోమంది ఉన్నారని వారిని ప్రశంసించారు. నటన, డ్యాన్స్ అనేవి ఒకదానికొకటి తోడుగా ఉండాలని, అంతేతప్ప రెండింటినీ వేర్వేరు కోణాల్లో చూడకూడదని స్పష్టం చేశారు. తాత్కాలికంగా వచ్చే విజయాల కంటే, కాలంతో సంబంధం లేకుండా శాశ్వతంగా గుర్తుండిపోయే మంచి పాత్రలు చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. కెరీర్ ప్రారంభంలో తాను నేర్చుకున్న అనుభవాలే ఇప్పుడు తనకు ఎంతగానో ఉ పయోగపడుతున్నాయని, తనను కాపాడుతున్నాయని వాటి వల్లే అన్ని భాషల్లోనూ వరుస అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. తమన్నా చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.







## రాజమౌళి అదిరిపోయే ప్రకటన...!

ప్రిన్స్ మహేష్ బాబు, జక్కన్న కాంబినేషన్ లో వస్తున్న కొత్త సినిమా వారణాసి. టైం ట్రావెల్ కాన్సెప్ట్ తో ఈ సినిమా వస్తోంది. ఈ సినిమాలో మహేష్ బాబు ఏకంగా ఐదు పాత్రల్లో కనిపిస్తారని కూడా టాక్ నడుస్తోంది. ఈ మూవీలో హీరోయిన్ పా- త్రలో ప్రియాంక చోప్రా మెరువనున్నారు. అయితే ఈ సినిమా గురించి తాజాగా రాజమౌళి చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. ఈ సినిమా వారణాసి నుంచి ప్రారంభం కానుందన్నారు. ఆ తర్వాత అంటార్కిటికా, ఆఫ్రికా, పురాతన రోమ్ నగరం వరకు ప్రయాణించి... చివరకు మళ్లీ వారణాసిలోనే ముగుస్తుందని ఆయన వెల్లడించారు. ఈ సినిమా షూటింగ్ దాదాపు 80% పూర్తయిందని కూడా ప్రకటించారు. ముఖ్యమైన భారీ యాక్షన్ సీన్స్ పూర్తయి కేవలం చిన్న సన్నివేశాలు మాత్రమే మిగిలి ఉన్నాయని వెల్లడించారు. దసరా పండుగ వరకు ఈ సినిమా షూటింగ్ పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు రాజమౌళి వెల్లడించారు. కాగా ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ స్పెషల్ రోల్ చేస- ్తున్నారు. కె.ఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఎం.ఎం కీరవాణి సంగీత స్వరాలు అందిస్తున్నారు. ఏప్రిల్ 7వ తేదీన 2027లో ఈ సినిమా రిలీజ్ కానుంది.



## ఈవెంట్ తేదీ.. వేదిక ఖరారు

వరుణ్ తేజ్ హీరోగా, రితిక నాయక్ హీరోయిన్‌గా మెర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకేక్కిన చిత్రం 'కొరియన్ కనకరాజు'. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రానికి స్టార్ సంగీత దర్శకుడు ఎస్.ఎస్ తమన్ సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో సినిమాపై మంచి అంచనాలను పెంచాయి. ఈ నేపథ్యంలో 'కొరియన్ కనకరాజు' ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఆగస్టు 4న సాయంత్రం 4:30 గంటల నుంచి భీమవరంలోని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజ్లో ఘనంగా నిర్వహించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ వేడుకలో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొనే అవకాశం ఉంది. కాగా, ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి.

## ఆయన బాటలోనే నా పయణం..



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ఇటీవల నటించిన చిత్రాలేవి ఆశించినంత స్థాయిలో హిట్ అందుకోనప్పటికీ.. ఏమాత్రం నిరాశ చెందకుండా గట్టి పట్టుదలతో డిఫరెంట్ స్టోరీ 'కొరియన్ కనకరాజు'తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను ఇండో-కొరియన్ హారర్ కామెడీ నేపథ్యంలో తీసుకురాబోతున్నారు. రితికా నాయక్, సత్య, సునీల్ కీలక పాత్రలో కనిపించబోతుండగా.. ఆగస్టు 7న థియేటర్స్‌లోకి రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ జోరు పెంచిన వరుణ్ తేజ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ ఆమిర్ ఖాన్‌ను ఆదర్శంగా తీసుకుంటూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఆమిర్ ఖాన్ చేసిన తరహా విభిన్నమైన సినిమాలతో కూడిన ఫిల్మోగ్రఫీని తాను కూడా సాధించాలని ఎప్పుడూ కోరుకుంటానని, అందుకే తన కెరీర్ ప్రారంభం నుండి వైవిధ్యమైన కథలను, విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ వచ్చానని స్పష్టం చేశారు.ఒకవేళ ఎవరైనా ఆమిర్ ఖాన్ దేనిలో బెస్ట్ అని అడిగితే, కేవలం ఒకే విషయాన్ని చెప్పడం చాలా కష్టమని వరుణ్ తేజ్ పేర్కొన్నారు. ఎందుకంటే ఆమిర్ ఖాన్ చేసే ప్రతి పనిలోనూ పూర్తి పరిపూర్ణత కనబడుతుందని ప్రశంసించారు. ఒకవైపు లగాన్, మ- రోవైపు తలాష్, ఇంకోవైపు 3 ఇడియట్స్ వంటి పూర్తి భిన్నమైన సినిమాలను ఆయన అందించారని గుర్తుచే శారు. తన కెరీర్‌లో కూడా అలాంటి బ్యాలెన్స్ సాధించడానికి ప్రయత్నించానని, కానీ ఇటీవల కాలంలో ఆ బ్యాలెన్స్ కాస్త తప్పిందని వరుణ్ తేజ్ అంగీకరించారు. అయితే రాబోయే 'కొరియన్ కనకరాజు' సినిమా కోసం మాత్రం ఆమిర్ ఖాన్ లాగే ముందస్తు ప్రణాళికతో అడుగులు వేశానని చెప్పారు. ఈసారి ఎక్కడా పొరపాటు జరగకుండా ఉండేందుకు, షూటింగ్ ప్రారంభదానికి ముందే దర్శకుడితో కూర్చుని కథా చర్చలు జరిపానని వెల్లడించారు. ఆమిర్ ఖాన్ ప్రతి సినిమాకు ఎంతో నిశితమైన ప్రిపరేషన్ చేసుకున్నట్లే, తాను కూడా ఈ సినిమా విషయంలో అంత జాగ్రత్తగా వ్యవహరించి మళ్లీ సరైన ట్రాక్‌లోకి వచ్చానని వరుణ్ తేజ్ చెప్పుకొచ్చారు.




## నేను బ్రతికి ఉంటాను..

తన వర్క్ షెడ్యూల్ గురించి వివరిస్తూ, నిరంతరం ఒక షూటింగ్ లొకేషన్ నుంచి మరొక లొకేషన్‌కు ప్రయాణిస్తూ ఏకంగా 41 గంటల పాటు నిద్రపోకుండా మెలకువగానే ఉన్నానని వెల్లడించారు. అంత ఎక్కువ సమయం పనిలోనే గడిపినప్పటికీ, షూటింగ్‌లతో బిజీగా ఉండటాన్ని తాను ఒక అదృష్టంగా, దేవుడి ఇచ్చిన వరంగా భావిస్తున్నట్లు కీర్తి పేర్కొన్నారు. తాను సోషల్ మీడియాలో ఎందుకు సరిగ్గా యాక్టివ్‌గా ఉండలేకపోతున్నానో వివరిస్తూ.. "నిన్న దీని గురించి పోస్ట్ చేయడానికి నా దగ్గర కనీసం శక్తి కూడా లేకపోయింది. నిద్రపోకుండా ఒక షూటింగ్ నుంచి మరో షూటింగ్‌కు నిరంతరం తిరుగుతూనే ఉన్నాను" అని రాసుకొచ్చారు. రోజంతా కష్టపడి పని చేసి రూమ్‌కి తిరిగి వచ్చాక మరొక అప్‌డేట్ ఇస్తూ.. "24 గంటలలో దాదాపు 20 గంటలు పనిలోనే గడిపాను. నిన్న ఉదయం 6 గంటలకు బయలుదేరితే మళ్లీ ఈ రోజు ఉదయం 6 గంటలకే గదికి వచ్చాను.అసలు విషయం ఏమిటంటే, మరో గంటలోనే నేను నా తదుపరి షూట్‌కి బయలుదేరాలి. కానీ ఫిర్యాదు చేయడానికి ఇవి చాలా మంచి సమస్యలు, జీవితం అంటే ఇదే కదా.. దీన్ని నేను ఒక ఆశీర్వాదంగా భావిస్తున్నాను" అని ఎంతో పాజిటివ్‌గా స్పందించారు. అంత విరామం లేని పనిలో కూడా మిర్రర్ సెల్ఫీ దిగి, ఫోటోలు తీసుకునేంత శక్తి తనకు ఇంకా మిగిలే ఉందంటూ సరదాగా కామెంట్ చేశారు. మరో పోస్ట్‌లో నేను బ్రతికి ఉంటాను అని రాసి ఉన్న తెల్లటి టీ-షర్టు ధరించి నవ్వుతూ పనికి బయలుదేరారు. ఈ రోజుకు ఈ టీ-షర్ట్‌కి నిజంగా ఒక ప్రత్యేకమైన అర్థం ఉందంటూ కీర్తి చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఆమె డెడికేషన్ గురించి తెలుసుకున్న నెటిజన్లు కొందరు షాక్ అవుతుండగా.. మరికొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## చైల్డ్ సెంటిమెంట్ హిట్ తీసుకొస్తుందా?

మాస్ మహారాజా రవితేజ ఎప్పుడూ సినిమాల విషయంలో ఏలాంటి సెంటిమెంట్లనూ పట్టించుకోరు. ఫ్లాపుల్లో ఉన్న దర్శకులకు, కలిసిరాని హీరోయిన్లకు కూడా మళ్లీ అవకాశాలు ఇస్తుంటారు. అలాగే తనతో హిట్స్ ఇచ్చిన ఫామ్‌లో ఉన్న డైరెక్టర్లతోనూ కొత్త ప్రాజెక్టులు చేస్తుంటారు. ఫ్లాప్స్ ఎదురైనా ఏమాత్రం వెనకడుగు వేయకుండా వరుస సినిమాలతో దూ- సుకెళ్లడం రవితేజ నైజం.అయితే రవితేజ చాలా కాలంగా డల్ గా సాగుతోంది. 2022లో వచ్చిన 'ధమాకా' చిత్రం తర్వాత రవితేజ ఖాతాలో ఆ స్థాయి బిగ్గెస్ట్ హిట్ పడలేదు. ఈ క్రమంలోనే మాస్ రాజా తన తదుపరి చిత్రం ద్వారా ఎలాగైనా గట్టి కంబ్యాక్ ఇవ్వాలని భావిస్తున్నారు.ప్రస్తుతం రవితేజ నటిస్తున్న చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమా తండ్రీ కూతుళ్ల సెంటిమెంట్ నేపథ్యంతో తెరకెక్కుతోంది. ఈ చిత్రం ఈ నెల 21న గ్రాండ్‌గా విడుదల కానుంది. గతంలో రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'విక్రమార్కుడు' సినిమాలో రవితేజ -- పాప సెంటిమెంట్ ఏ స్థాయిలో వర్కవుట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ భావోద్వేగాలు థియేటర్లలో ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. మళ్లీ చాలా కాలం తర్వాత 'ఇరుముడి' చిత్రంతో బలమైన తండ్రీ-కూతుళ్ల ఎమోషన్‌తో రవితేజ ముందుకు వస్తున్నారు. మరి ఈ చైల్డ్ సెంటిమెంట్ మాస్ రాజాకు మళ్లీ ఆ స్థాయి గ్రాండ్ హిట్‌ను తెచ్చిపెడుతుందో లేదో చూడాలి. తమిళ హీరోయిన్ ప్రియా భవాని శంకర్ హీరోయిన్ గా నటిస్తుండగా జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్నాడు. మైత్రీ మూవీస్ భారీ బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మిస్తోంది.




Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**